Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 167 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
శనివారం, 7 - 2 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## సోషల్ మీడియా ద్వారా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు విస్తృత ప్రచారం

### - సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లకు పట్టాభిరామ్ పిలుపు





**విజయవాడ, (రాజధాని వార్తలు):** సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లు అందరూ స్వచ్ఛ ఆంధ్ర కార్యకర్తలుగా మారి సోషల్ మీడియా ద్వారా స్వచ్ఛాంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపు ఇచ్చారు. విజయవాడలోని పార్క్ ఎన్ హోటల్లో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్న మెంట్ (ఏఐఐఎల్ఎస్‌జీ), స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్‌తో కలిసి శుక్రవారం సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లకు నిర్వహించిన అవగా హనా సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని, మాట్లాడారు. సోషల్ మీడియా రాకతో మీడియా రంగంలో విప్లవాత్మక మార్పు వచ్చిందన్నారు. గత మూడు దశాబ్దాలలో మీడియాలో విపరీతమైన మార్పులు వచ్చాయని, ప్రింట్ మీడియా నుంచి ఎలక్ట్రానిక్ మీడియాకు రావడం, 24 గంటలూ వార్తలు చూసే స్థాయికి చేరుకున్నామన్నారు. ప్రతి ఒక్కరూ జర్నలిస్టుగా మారేటటువంటి అవకాశం వచ్చిందని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లు అందరూ జర్నలిస్టుల పాత్ర పోషిస్తున్నారని చెప్పారు.

**వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రతి ఒక్కరికీ సంబంధించినది**

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొంటూ, సహకరిస్తున్న అందరికీ పట్టాభిరామ్ కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణం, స్వచ్ఛత, పారిశుద్ధ్యం వంటి విషయాలను మీరు అర్థం చేసుకుని, పది మందికి తెలియజేయాలని కోరారు. వేస్ట్ మేనేజ్ మెంట్ అనేది ప్రతి ఒక్కరికీ సంబంధించినదని చెప్పారు. దీనిపై దృష్టిపెట్టకపోతే భవిష్యత్తులో అత్యంత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. దీని ప్రాధాన్యతను గుర్తించిన విజనరీ లీడర్, మన సీఎం చంద్రబాబు నాయుడు నెలలో ఒక రోజు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్ర మాలకు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో ప్రతి రోజూ 11 వేల టన్నుల చెత్త వస్తోందని, అంత చెత్త దీర్ఘ కాలం పేరుకుపోతే ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవాలన్నారు. చెత్తను వదిలివేయడం వల్ల ఇప్పటికే 90 లక్షల టన్నుల చెత్త పేరుకు పోయిందని తెలిపారు. డంపింగ్ యార్డులలో పేరుకుపోయిన చెత్త వల్ల వైరస్ పుట్టుకొస్తుందని హెచ్చరించారు. కరోనా వైరస్ అలా పుట్టుకొచ్చిందేనని తెలిపారు.

**శాస్త్రీయ పద్ధతిలో సాలిడ్ వేస్ట్ ప్రాసెస్**

రాష్ట్రంలో 123 కార్పోరేషన్లు, మునిసిపాలిటీలు ఉన్నాయని, ఆయా ప్రాంతాలలో పేరుకుపోయిన వేస్ట్ ని బయోమైనింగ్ ద్వారా ప్రాసెసింగ్ చేయడానికి యూనిట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. శాస్త్రీయ పద్ధతిలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ అనేది మంచి ఆరోగ్యకరమైన పరిణామం అన్నారు. బయోమైనింగ్ ద్వారా జరిగే ప్రాసెసింగ్ అంతా ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. మీరు కూడా మీదైన పద్ధతిలో సోషల్ మీడియా ద్వారా ఈ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిం చాలని కోరారు. ఏ రోజు వేస్ట్ ఆ రోజు ప్రాసెసింగ్ అయ్యే విధంగా ప్రాసెసింగ్ సెంటర్లు పెడుతున్నట్లు చెప్పారు. ఇంటి వద్దే తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడం వల్ల ప్రాసెసింగ్ తేలిక అవుతుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుం దని, అందుకు మీ సహకారం అవసరం అని చెప్పారు. ఈ విష యాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. లెగసీ వేస్ట్ వల్ల ప్రమాదం పొంచి ఉందని, అందువల్ల దానిని ప్రాసెసింగ్ చేయవలసిన అవసరం ఉందన్నారు. డంప్ యార్డులను పార్కులుగా మారుస్తు న్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను డంప్ యార్డ్ లేని రాష్ట్రంగా రూపొందించడమే తమ లక్ష్యం అని చెప్పారు. తడి చెత్త కంపోస్ట్ కు వెళితే, పొడి చెత్త రీసైక్లింగ్‌కి వెళుతుందన్నారు. పేరుకుపో తున్న చెత్త ద్వారా బయో గ్యాస్, ఆర్గానిక్ కంపోస్ట్ వంటి వాటిని తయారు చేస్తున్నట్లు తెలిపారు. కెమికల్ ఫర్టిలైజర్స్ ని తగ్గించాలని, అందుకు ప్రత్యామ్నాయంగా ఆర్గానిక్ కంపోస్ట్‌ని ఉపయో గించాలన్నారు.

**రీసైక్లింగ్‌కి సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీకి ఉన్నంత ప్రాధాన్యత**

సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీకి ఎంత ప్రాధాన్యత ఉందో, రీసైక్లింగ్‌కి అంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ పాలసీ ప్రవేశపెట్టడంతో చెత్త కొనుగోలు చేసే పరిస్థితి వచ్చిం దన్నారు. ఆధునిక ఆలోచనలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపా రు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే, మనం చెత్తకు డబ్బులు ఇస్తున్నామని చెప్పారు. స్వచ్ఛరథం పేరుతో వేస్టుని కొనుగోలు చేస్తున్నామని, వేస్ట్‌ని తీసుకుని, నిత్యావసర వస్తువులు ఇస్తున్నా మని వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే వారికి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇన్ఫ్లుయన్సర్లు అడిగిన ప్రశ్నలకు పట్టాభిరామ్ సమా ధానాలు చెప్పారు. అనంతరం కంటెంట్ పోస్టర్‌ని పట్టాభిరామ్ విడుదల చేశారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఇటువంటి సదస్సు మొదటి సారి గుజరాత్‌లో జరిగింది. ఇది రెండవ సదస్సు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి సోషల్ మీడియా ఇన్ఫ్లుయన్సర్లు 70 మంది వరకు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సు ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర, సర్క్యులర్ ఎకానమీపై చేసిన ప్రసంగాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఎల్ఎస్‌జీ ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు కోఆర్డినేటర్ చలపతిరాజు, ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్.రాజేష్, నోడల్ ఆఫీసర్ ఏ.శివన్నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ప్రతినిధులు ఎం. వినయ్ తేజ్, రిసోర్స్ పర్సన్స్ హరీష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


## భూమి అంటే మనకు నమ్మకం, విశ్వాసం, అమ్మతో సమానం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**ఎమ్మిగనూరు, (రాజధాని వార్తలు):** ఎమ్మిగనూరు నియోజకవర్గం కలుగట్లలో మీ భూమి- మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మీ భూమి- మీ హక్కు ద్వారా రాజము ద్రతో కూడిన భూ యాజమాన్య పత్రాలు ఇవ్వటం చాలా సంతో షంగా ఉంది. భూమి అంటే మనకు నమ్మకం, విశ్వాసం, అమ్మతో సమానం. భూమితో మనకున్న అనుబంధాన్ని ఎవరూ చెరపలేరు. పశ్చిమ కర్నూలుకు కూడా నీరిచ్చి రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు నీరిచ్చే లక్ష్యాన్ని చేరుకుంటాం. రైతుకు లాభాలు ఇచ్చే సాగు జరగాలి. దానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగిస్తాం. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమిగా ప్రజల ముం దుకు వచ్చాం. సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ చేశాం. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తు న్నాం. పోలవరం, అమరావతి నిర్మాణం, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిపై ఫోటోలు వేసుకోవడానికి అతను ఎవరు?అందుకే రాజముద్రతో, విశిష్టభద్రతా ఫీచర్లతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. తప్పుడు విధానాల ద్వారా మీ భూములన్నీ కాజేసే ప్రయత్నం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా వివాదాలు ఉన్న భూములపై పెత్తనం చేయడానికి సొంత మనుషుల్ని ఏర్పాటు చేశారు. పులివెందుల నుంచి తెచ్చుకున్న మనుషులతో మీ పొలాలను, స్థలాలను కాజేసే ప్రయత్నం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలపైనా, సరిహద్దు రాళ్లపైనా, పిల్లల స్కూలు బ్యాగులు, పుస్తకాలపైనా ఆయన ఫోటోలు వేసుకున్నారు. రూ.700 కోట్లను సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకోడానికి ఖర్చు పెట్టిన వ్యక్తి అత్యంత దుర్మార్గం చేశారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీల్లో 80 శాతం భూవివాదాలకు సం బంధించినవే. ప్రతీ ఊర్లోనూ ఉండే ఆ పార్టీ రౌడీలు మీ భూమిని తక్కువధరకు ఇస్తే సరేసరి లేకపోతే 22ఏలో పెట్టేశారు. లక్షల ఎకరాలను ఈ రకంగా కాజేశారు. తాడేపల్లి వద్ద ఇంటిని కట్టుకున్నారు. అక్కడే హెలిపాడ్ వేసుకోవాల్సి వస్తే 10 ఎకరాల ను బలవంతంగా కాజేశారు. 70 ఏళ్ల నుంచి అనుభవంలో ఉన్న భూమిని 22 ఏలో పెట్టేసి వివాదం చేసేశారు. 1956 నుంచి రికార్డులు ఉన్న భూమిని కాజేయడానికి 22ఏలో పెట్టి కాజేసిన వ్యవహారం అంతా ఇప్పుడు వెలుగు చూసింది. కేవలం హెలిపాడ్ నిర్మాణం కోసం ప్రైవేటు భూమిని దొంగతనంగా గవర్నమెంటు భూమిగా మార్చేసి ఆయన అనుభవించాడు. రాజకీయ కక్షలతో ఇష్టాను సారంగా పాలన అస్తవ్యస్తం చేశారు. 2019-24 మధ్య పాలన చక్కగా చేస్తే ఇప్పుడు రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఎలా వచ్చాయని గత పాలకుడిని ప్రశ్నిస్తున్నాను. జీవితంలో ఎవడూ రైతుల భూములపై కన్నేయకుండా భద్రతా విధానాలతో కూడిన పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి పారేశాం. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ద్వారా పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. గతంలో భూమి కాజేయాలంటే 22ఏ కింద పెట్టేసి దానిని తీసేసుకునేవారు. ఇప్పుడు భూ రికార్డులను ట్యాంపర్ చేయకుండా భద్రతా ఫీచర్లు తీసుకువచ్చాం. ఎవరైనా తారుమారు చేసే ప్రయత్నం చేస్తే వారిని జైలుకు పంపేలా నిబంధనలు పెట్టాం. ఇప్పుడు పటిష్టంగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. ఎలాంటి తప్పులూ దొర్లకుండా పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాం. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతీనెలా 9వ తేదీన కార్యక్రమం చేపట్టి పట్టాదారు పాస్ పుస్తకా లు ఇస్తున్నాం. నయాపైసా లంచం లేకుండా ఈ పాస్ పుస్తకాలను జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నాను. ఈ నెలలో 279 గ్రామాల్లో సర్వే చేసి 1.16 లక్షల మందికి పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. 18 లక్షల పాస్ పుస్తకాలను ఏప్రిల్ నెలలోగా జారీ చేయాలని ప్రయత్నిస్తున్నాం. ఇప్పటి వరకూ 37.40 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం అయ్యాయి. వీటితో పాటు 9500 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. 62 లక్షల పాస్ పుస్తకాలు ఇంకా జారీ చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తి అయితే వందశాతం పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్టే. ఎక్కడా తప్పులు లేని భూమి రికార్డులు తయారు చేయటమే లక్ష్యంగా ఈ ప్రక్రియ చేపట్టాం. 2027 డిసెంబరు వరకూ ప్రతీ ఒక్కరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వారసత్వంగా వచ్చిన భూమిని కేవలం వంద రూపాయలతో మ్యూటేషన్ చేసుకునేలా చర్యలు తీసుకున్నాం.

## రాష్ట్రంలో సరికొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం

### - కేంద్రమంత్రితో కలిసి 'క్వాంటం వ్యాలీ'కి నేడు సీఎం చంద్రబాబు శంకుస్థాపన




**అమరావతి, (రాజధాని వార్తలు):** భారతదేశ భవిష్యత్ సాంకేతిక రంగాన్ని మలుపుతిప్పే చారిత్రక ఘట్టానికి అమరావతి శనివారం వేదికగా నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి రేపు పునాదిరాయి పడు తోంది. దీని ద్వారా భారతదేశం క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్ట్రానికి రానుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీనికోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయిం చింది. మధ్యాహ్నం 2.45 గంటలకు క్యాంప్ ఆఫీస్ నుంచి ముఖ్యమంత్రి బయలుదేరి 3.00 గంటలకు ఉద్దండరాయుని పాలెం చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే క్వాంటమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు. రాష్ట్రానికి, దేశానికి మైలురాయిఅమరావతిలో రూపుదిద్దుకుంటున్న క్వాంటమ్ వ్యాలీ రాష్ట్రానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాం టమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, ఉత్పత్తి, నైపుణ్యా భివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు తలపెట్టారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టం విస్తరణ, లక్షలాది యువతకు నైపుణ్య శిక్షణ, పెద్దఎత్తున ఉపాధి అవకా శాలు సాధ్యం కావాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు. సామాన్యు డికి ఎంతో ఉపయోగంక్వాంటమ్ టెక్నాలజీతో సామాన్యుడి జీవి తంలో మార్పు వస్తుంది. క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతం కావడం, వ్యాధుల నిర్ధారణ మెరుగుపడడం, వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితత్వంతో ఉండడం, బ్యాంకింగ్-డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందనున్నాయి. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబర్ కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సిలికాన్ వ్యాలీ ఐటీ విప్లవానికి నాయకత్వం వహిం చినట్లే..., అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచంలోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలుస్తుంది. భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుంది.

## సీనియర్ జర్నలిస్ట్ యేమినేనికి ఏ.పి.ఎం.పి.ఏ. నాయకుల పరామర్శ



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఇటీవల బైక్ ప్రమాదానికి గురై విజయవాడలోని ఇంటి వద్ద వైద్య చికిత్స పొందుతున్న సీని యర్ జర్నలిస్ట్ ఎన్టీఆర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీ యేమినేని వెంకటరమణను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, నగర అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు తాళ్లూరి అనిల్ కుమార్, గుర్రం శ్రీనివాస్ మరియు నగర నాయకులు వి.బంగారు రాజు ఉప్పులూరి రవితేజ తది తరులు. పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం హితం కోసం అహర్నిశలు కృషి చేసే సీనియర్ జర్నలిస్ట్ రమణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములవ్వాలి

**- పేదరికంలేని సమాజ నిర్మాణానికి తమ వంతు సేవలందించాలి - నూతన సాంకేతిక విధానంతో పారదర్శకంగా ప్రజలకు దగ్గరవ్వాలి - రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**







**విజయవాడ, (రాజధాని వార్తలు):** స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో శుక్ర వారం జిల్లా, మండల, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులకు, అర్బన్ స్వర్ణ వార్డు అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ, స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రి మాట్లాడుతూ.. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు, స్వర్ణ మండల, స్వర్ణ జిల్లాల ద్వారా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్' సాధించడమే లక్ష్యమని అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం మేరకు 'విజన్ 2047'లో భాగంగా 'స్వర్ణాంధ్ర ప్రదేశ్'ను సాధించడమే లక్ష్యమన్నారు. జిల్లా, మండల స్థాయి అర్బన్ లెవల్ స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారులందరులకు మంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల గతంలో వేర్వేరు క్యాడర్‌లలో ఉన్న అధికారులందరికీ నేడు ఇప్పుడు పదోన్నతులు లభించాయని ఆయన పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖల పర్యవేక్షణ వేర్వేరుగా ఉండేదని, అయితే మెరుగైన పర్యవేక్షణ కోసం నేడు వాటిని సమన్వయం చేస్తూ స్వర్ణ గ్రామ సచివాలయాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న సుమారు 20,000 పోస్టులతో కలిపి మొత్తం 1,40,000 మంది సిబ్బంది స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ శాఖలో పనిచేస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఏ, బి, సి కేటగిరీలుగా సిబ్బందిని విభజించి (రేషనలైజేషన్) సేవలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలను బలోపేతం చేస్తూ 10 మంది అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. మండల స్థాయిలో అధికారులకు సహాయంగా ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించామన్నారు. విశాఖపట్నం వంటి మహానగరాల్లో 18 మంది, ఇతర నగర పంచాయతీలలో జనాభాను బట్టి 4 నుండి 10 మంది వరకు సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు. క్లస్టర్ ఆధారిత సేవలను అందిస్తూ, సంబంధిత విభాగాలతో (లైన్ డిపార్ట్‌మెంట్స్) సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గుర్తు చేశారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా, మండల, పట్టణ స్థాయిల్లో 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖలో పదోన్నతి పొందిన అధికారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని ప్రజలకు గౌరవ, వేగవంతమైన సేవలను అందించాలన్నారు. స్వర్ణ గ్రామం/ స్వర్ణ వార్డు కేవలం పేరు మార్పు మాత్రమే కాదని 2047 నాటికి మన దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే ప్రక్రియలో భాగంగా ఈ మార్పు జరిగిందన్నారు. ప్రతి గ్రామం, వార్డులో మెరుగైన మౌలిక సదుపాయాలు (రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీ వ్యవస్థ) కల్పించి, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే దీని ప్రధాన ఉద్దేశం అన్నారు. సాంకేతికత వేగంగా మారుతోందని, ప్రభుత్వం ఇప్పటికే చాట్ బాట్లను ఉపయోగించి ఉత్తర్వులు జారీ చేసే స్థాయికి చేరిందని ఆయన గుర్తు చేశారు. అధికారులు ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలతో మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలిగి, పనులను నిర్ణీత సమయంలో, నిబంధనల ప్రకారం గౌరవంగా పూర్తి చేయాలన్నారు. బయోమెట్రిక్ వంటి పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం లేని విధంగా, ప్రతి అధికారి తమ బాధ్యతను గుర్తించి సక్రమంగా పని చేయాలన్నారు. ఒక సామాన్య పౌరుడు ఆఫీసుకి వస్తే మనం ఎలా స్పందించాలో ఆలోచించి, సేవలందించాలని కార్యదర్శి కాటమనేని భాస్కర్ కోరారు. స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామ సచివాలయ శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో 'గ్రామ వార్డు సచివాలయ శాఖ'గా ఉన్న పేరును నేడు 'స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు' శాఖగా మార్చామన్నారు. సచివాలయాల పర్యవేక్షణ కోసం మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులతో కూడిన మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పనిభారాన్ని క్రమబద్ధీకరించడానికి జనాభా ఆధారంగా కార్యాలయాలను మూడు కేటగిరీలుగా విభజించామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ సెక్రటరీల పదోన్నతులపై ఉన్న సందిగ్ధతను తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒక 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్' కమిటీని వేశామన్నారు. రాబోయే రెండు నెలల్లో దీనిపై స్పష్టమైన నిబంధనలు వస్తాయని డైరెక్టర్ ఎం. శివ ప్రసాద్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏడీసీ సీబీ అండ్ హెచ్ఆర్ జీవీ సూర్యనారాయణ, ఏడీసీ డీఎస్ ఎస్. గౌతమి, చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ సీహెచ్. చిన్నారావు, ప్రణాళిక శాఖ అధికారి అనంత శంకర్, తదితర అధికారులు ఓరియెం టేషన్‌పై ఉద్యోగులకు, అధికారులకు అవగాహన కల్పించారు.

# ల్యాండ్ పూలింగ్‌పై గ్రామాల వారీగా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నాం : మంత్రి నారాయణ


**- మార్చి నెలాఖరు నాటికి ప్రభుత్వ అధికారుల భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తాం**
**- ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేటు సంస్థల నిర్మాణాలు కూడా వేగంగా జరుగుతున్నాయి**
**- అమరావతి ప్రాంతంలో నిర్మాణాలు పరిశీలించిన మంత్రి నారాయణ**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ల్యాండ్ పూలింగ్‌పై రైతుల సమస్యలు నివృత్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు మంత్రి నారాయణ...ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ,ఇన్నర్ రింగ్ రోడ్డు,రైల్వే స్టేషన్,రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ చేస్తున్నామని తెలిపారు. రాజధానిలో పలు నిర్మాణాలను మంత్రి నారాయణ పరిశీలించారు. రాయపూడిలో నిర్మాణంలో ఉన్న మంత్రుల బంగళాలను మంత్రి పరిశీలించి కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేసారు.నేలపాడులో నిర్మిస్తున్న జీఏడీ టవర్‌కు అవసరమైన డయాగ్రిడ్ కొరకు స్టీల్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను మంత్రి నారాయణ ప్రారంభించారు..ఆ తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. గతంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని గ్రామాల వారీగా సమస్యలన్నీ పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని మంత్రి చెప్పారు. మొత్తం 16,667 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ చేస్తున్నామన్నారు...ఆయా గ్రామాలలో రైతులంతా ప్రభుత్వానికి భూములు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు...రాజధానిలో నిర్మాణ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని....350 కి.మీ ట్రంక్ రోడ్లు,1500 కి.మీ లేఅవుట్ రోడ్ల నిర్మాణ పనులు చాలా వేగంగా సాగుతున్నాయన్నారు మంత్రి. రోడ్లతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజి,డ్రింకింగ్ వాటర్,సీవరేజి లైన్‌లు, విద్యుత్ లైన్ల వంటి మౌళిక వసతుల కల్పన పనులు కూడా చాలా వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు,ఉద్యోగుల కొరకు ఇళ్ల నిర్మాణాలు ఓ వైపు జరుగుతుండగా ప్రయివేట్ సంస్థల కార్యాలయాల నిర్మాణాలు కూడా వేగవంతం అయ్యాయని మంత్రి చెప్పారు. అమరావతిలో ప్రిన్సిపల్ సెక్రటరీల కోసం 25 బంగళాలు,సెక్రటరీల కోసం 90 బంగళాలు,మంత్రుల కొరకు 35 బంగళాలు,జడ్జిలకు 36 బంగళాల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయన్నారు...మరో వైపు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కోసం 288 ఇళ్లు, ఆలిండియా సర్వీస్ అధికారులకు 144 ఇళ్లు, ఎన్జీవోల కొరకు 1968, గెజిటెడ్, గ్రూప్–డి ఉద్యోగుల కొరకు 1440 ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. మొత్తం 4026 ఇళ్లకు గాను 3500 ఇళ్లను వచ్చే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి ఏప్రిల్‌లో అధికారులకు అందజేస్తామని మంత్రి చెప్పారు. అమరావతిలో రైల్వే స్టేషన్ నిర్మాణానికి ఎంత భూమి అవసరం అనే దానిపై సంబంధిత అధికారుల నుంచి ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం రాలేదన్నారు మంత్రి నారాయణ...ఇదే వేగంతో అమరావతి నిర్మాణం పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేసారు.

# విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో 'శాంతి సమర్' పుస్తకావిష్కరణ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో గురువారం సాహిత్య సందడి నెలకొంది. ప్రసిద్ధ తెలుగు రచయిత శ్రీ పోట్లూరు సుబ్రహ్మణ్యం రాసిన 10 ఉత్తమ తెలుగు కథలను, డా. ఐనాపురం.రామలింగేశ్వర రావు హిందీలోకి అనువదించిన 'శాంతి సమర్' పుస్తకాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

**భాషల మధ్య అనుసంధానం అవసరం: ఉపకులపతి**

ఈ సందర్భంగా ఉపకులపతి అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

సాహిత్య వ్యాప్తి: తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువదించడం ద్వారా మన సంస్కృతి యొక్క సార్వత్రికత ప్రపంచానికి చేరుతుందని అన్నారు.

సాంస్కృతిక వారధి: తెలుగు కథలను హిందీలోకి తీసుకురావడం భాషల మధ్య అనుసంధానాన్ని బలపరుస్తుందని ప్రశంసించారు.

నెల్లూరు ప్రాశస్త్యం: నెల్లూరు జిల్లా కవులు, కళాకారులకు పుట్టినిల్లని, యువతరానికి కవిత్వంపై అవగాహన కల్పించేందుకు విశ్వవిద్యాలయంలో మరిన్ని కవి సమ్మేళనాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతకు సత్కారం

బాల సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు గాను ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న నెల్లూరు వాసి డా. గంగిశెట్టి శివకుమార్‌ను ఈ వేదికపై ఉపకులపతి మరియు రిజిస్ట్రార్ ఘనంగా సత్కరించారు.

"సాహిత్య విలువలు విస్తృతంగా వ్యాప్తి చెందడానికి అనువాదాలు ఎంతో దోహదపడతాయి. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొం దిస్తాయి.

డా.కె.సునీత, రిజిస్ట్రార్, విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం.

ఈ కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షు లు గోవిందరాజ. సుభద్రాదేవి, కవి ఇంద్రగంటి మధుసూదన రావు, విశ్వవిద్యాలయ తెలుగు అధ్యాపకులు డా.రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలి కుటుంబానికి అండగా ఉండి పూర్తి స్థాయిలో న్యాయం

**- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ**





**విజయవాడ, (రాజధాని వార్తలు):** బాధితురాలి కుటుంబానికి అండగా ఉండి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మెడికో దీపిక మృతి చెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శ్రీమతి రాయపాటి శైలజ శుక్రవారం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియా ప్రతినిధులతో చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మెడికో దీపిక మృతి చెందడం చాలా దురదృష్టకరమని, ఈ విషయంలో వారి కుటుంబ సభ్యులకు మహిళా కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. బాధితురాలు గత మూడేళ్లుగా ఇక్కడే చదువుతోందని, ఆమె ప్రవర్తనలో ఏవైనా మార్పులు వచ్చాయా లేదా ఏదైనా ఒత్తిడి ఉందా అనే కోణంలో తోటి విద్యార్థులు, సహచర డాక్టర్లతో చైర్‌పర్సన్ వ్యక్తిగతంగా మాట్లాడారు. దీపిక చాలా ప్రతిభావంతురాలని, ఆమె ప్రవర్తనలో ఎలాంటి అసాధారణ మార్పులు లేవని విద్యార్థులు తెలిపారన్నారు. మృతదేహంపై ఉన్న 'పంక్చర్ మార్క్స్' (సూది గుర్తులు) దేనివల్ల వచ్చాయనేది తేలాల్సి ఉందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. నమూనాలను బయాప్సీ, ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం పంపామని, ఈ నివేదికలు రావడానికి రెండు నుండి మూడు వారాల సమయం పడుతుందని అధికారులు వివరించారన్నారు. ఆహారం వల్ల విష ప్రయోగం జరిగి ఉండవచ్చనే అనుమానాలను ఆమె తోసిపుచ్చారు. దీపికతో కలిసి భోజనం చేసిన మరో జూనియర్ డాక్టర్ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం వాంతుల నివారణకు వాడే 'ఆండన్సెట్రాన్' ఇంజెక్షన్ తీసుకున్నట్లు తెలుస్తోందని వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా కాల్ డేటా రికార్డ్స్, పోస్ట్‌మార్టం నివేదికల కోసం వేచి చూస్తున్నట్లు ఆమె తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టులు వచ్చిన తర్వాతే ఇది ఆత్మహత్యా లేక ఇతర కారణాలా అనేది స్పష్టమవుతుందన్నారు. బాధితురాలి కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. దర్యాప్తు పారదర్శకంగా జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. చైర్ పర్సన్ విజిట్‌లో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆలపాటి ఏడుకొండల రావు, ఆర్ఎంవోలు ఉన్నారు.

# 47వ డివిజన్‌లో కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ పర్యటన



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు సిటీ 47వ డివిజన్ పరిధిలోని కామాటి వీధి, జండా వీధి ఏరియాలో 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కామాటి వీధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, శానిటేషన్ సూపర్వైజర్ ఆశీర్వాదం, శానిటేషన్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డిలను అక్కడికి పిలిపించి పరిస్థితిని వివరించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు చేపడతామని అధికారులతో హామీ ఇచ్చారు. అలాగే జండా వీధిలో కొనసాగుతున్న వాటర్ ట్యాంక్ పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రెహమాన్, ఐటిడిపి జనరల్ సెక్రెటరీ విజయ్, మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ ఉమేహాని బేగం తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టీ ఆదాయం పెంపునకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్య ఆదాయ వనరుగా ఉన్న జిఎస్టీ వసూళ్లను పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో కమర్షియల్ టాక్స్ శాఖతో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు.తొలుత జాయింట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) వై. కిరణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పన్ను వసూళ్ల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు కాని వ్యాపార సంస్థలను గుర్తించి జిఎస్టీ పరిధిలోకి తీసుకు రావాలని, పన్ను ఎగవేతను అరికట్టేందుకు శాఖల మధ్య సమాచారాన్ని క్రమం తప్పకుండా పంచుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల సమయంలో జిఎస్టీ మరియు టిడిఎస్ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, రూ. 2.5 లక్షలకు పైబడిన సరఫరా ఒప్పందాలపై జిఎస్‌టిఆర్-7 ద్వారా టిడిఎస్ చెల్లింపులు చేయాలని ఆదేశించారు. పన్ను ఎగవేతదారులపై ఈఎఫ్ఐ నమోదు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అదేవిధంగా పన్ను బకాయిల వసూళ్లకు సంబంధించి బకాయిదారుల ఆస్తుల వివరాలను కమర్షియల్ టాక్స్ శాఖకు అందించాలని, పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రానైట్ తదితర సరుకుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా మరియు మైనింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు డీజిల్‌ను స్థానికంగా కొనుగోలు చేయడం ద్వారా రాష్ట్రానికి పన్ను ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.అంతేకాకుండా రూ. 10 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన వ్యాపార సంస్థలు, డాక్టర్లు, ఆర్కిటెక్ట్స్ వంటి నిపుణులు ప్రొఫెషన్ టాక్స్ చట్టం కింద పన్ను చెల్లించాలని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) వై.కిరణ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం. సత్య ప్రకాష్, ఏఎస్ పి దీక్ష, మున్సిపల్ కమిషనర్ నందన్, జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్, డిటిసి చందర్, డిపిఓ వసుమతి, డిఇఓ బాలాజీ రావు, కమర్షియల్ టాక్స్ అధికారులు గోపీచంద్, సోమసుందర ప్రసాద్, గౌస్ పీర, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాలో 21 బార్లకు నోటిఫికేషన్ వదలగా 87 అప్లికేషన్‌లు వచ్చాయి..ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో లాటరీ ద్వారా బార్లు కేటాయింపు**

**- నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18, కావలిలో, ఆత్మకూరులో 1 బారు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో ఓపెన్ కేటగరీకి సంబంధించిన మొత్తం 21 బార్లకు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ద్వారా నోటిఫికేషన్ జారీ చేయబడగా, ఈ 21 బార్లకు సంబంధించి మొత్తం 87 దరఖాస్తులు అందినవి. ఈ దరఖాస్తులపై ఈ రోజు అనగా తేది : 05.02.2026 న, నెల్లూరు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ హాలులో, గౌరవనీయులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన లాటరీ విధానం ద్వారా మొత్తం 21 బార్లను కేటాయించడం జరిగింది. ఈ లాటరీ ప్రక్రియలో జిల్లా డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, నెల్లూరు జిల్లా వీ.శంకరయ్య, సహాయ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ - పి.దయా సాగర్, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి-ఏ.శ్రీనివాసులు నాయుడు, సహాయ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ - జీ.రమేష్, సహాయ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) - జగదీశ్వర రెడ్డి, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మరియు సబ్-ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఈ లాటరీ ద్వారా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18 బార్లు, 2025--26 సంవత్సరానికి గాను రూ. 10,12,50,000/- లైసెన్స్ ఫీజుతో కేటాయించబడినవి. కావలి మున్సిపాలిటీ పరిధిలోని 2 బార్లు, రూ. 82,50,000/- లైసెన్స్ ఫీజుతో కేటాయించబడినవి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 1 బార్, రూ. 26,25,000/- లైసెన్స్ ఫీజుతో కేటాయించబడినది. లాటరీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా మరియు నిబంధనల ప్రకారం నిర్వహించడం జరిగిందని తెలియజేయడమైనది.

# ఏపీలో జాతీయ రహదారుల నిర్వహణ వేగవంతానికి తీసుకుంటున్న చర్యలేంటి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్వహణను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. గురువారం లోక్‌సభలో జాతీయ రహదారుల అంశంపై పలు ప్రశ్నలు వేశారు. గత ఐదేళ్లలో జాతీయ రహదారి విస్తరణలలో జరిగిన ప్రమాదాల వివరాలు తెలియజేయాలన్నారు. నిర్వహణ సమయం, ట్రాఫిక్ అంతరాయాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు వివరించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకున్నారా అని ఆరా తీశారు. జాతీయ రహదారులపై భద్రతను మెరుగుపరచడానికి ఉపగ్రహ మ్యాపింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రియల్-టైమ్ మానిటరింగ్ వ్యవస్థల వంటి సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించే అంశాలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం ఇచ్చారు. రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ.. నిరంతరం జాతీయ రహదారుల నిర్వహణను పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్వహణ పనితీరు ఆధారిత నిర్వహణ ఒప్పందాలు, స్వల్పకాలిక నిర్వహణ ఒప్పందాలు ద్వారా రహదారుల నిర్వహణలో సమయ పాలన పాటిస్తున్నట్లు చెప్పారు. నిర్వహణలో ఉన్న జాతీయ రహదారుల లోపాల బాధ్యత సదరు కాంట్రాక్టర్‌దేనని చెప్పారు. నిర్వహణ సమయాలను తగ్గించడానికి క్రమం తప్పకుండా అంచనాలు, ముందస్తు ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని నిర్వహణలో ఉన్న జాతీయ రహదారి ప్రాంతాలలో 31,652 ప్రమాదాలు జరగగా..4,383 మంది మరణించారన్నారు. గత మూడేళ్ల కాలంలో కాంట్రాక్టర్లు నిర్వహణ పనులలో ఎలాంటి పొరపాట్లు, జాప్యాలు చేసిన దాఖలాలు లేవన్నారు. జాతీయ రహదారుల నిర్వహణ సమయంలో భద్రతను మెరుగుపరచడానికి ప్రభుత్వం అధునాతన సాంకేతికతలు/పరికరాలను ఉపయోగిస్తున్నామన్నారు. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉపయోగించి ప్రత్యేక కెమెరాలు, సెన్సార్లు, ఏఐద్వారా రియల్-టైమ్ డేటాను ఉపయోగించి ట్రాఫిక్ నియంత్రణ చేయడంతోపాటు హైవేలపై భద్రతను పర్యవేక్షిస్తున్నామన్నారు. నెట్‌వర్క్ సర్వే వెహికల్ ద్వారా LiDAR, 3D లేజర్ స్కానర్లు, హై-రిజల్యూషన్ 360-డిగ్రీ కెమెరాలు, DGPS వంటి అధునాతన సెన్సార్‌లతో కూడిన ప్రత్యేక వాహనం ఉపయోగించి రోడ్డు పరిస్థితులు, పేవ్‌మెంట్ బాధ, భద్రతను అంచనా వేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇక డ్రోన్ అనలిటిక్స్ మానిటరింగ్ సిస్టమ్ ఉపయోగించి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పర్యవేక్షణ, గుంతలు, పగుళ్లు, ఆక్రమణల వంటి లోపాలను గుర్తిస్తున్నామన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహణ సంస్థ నిర్వహిస్తున్న జాతీయ రహదారులు 2562.62 కి.మీ ఉండగా.. MoRTH ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ నిర్వహణలో ఉన్న జాతీయ రహదారులు 357.7 కి.మీ ఉందన్నారు. NHAI నిర్వహణలో ఉన్న జాతీయ రహదారులు 2620 కి.మీ ఉందన్నారు.

# ఏపీలో మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనల వివరాలేంటి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రతిపాదనల వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. అలాగే దేశవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఉన్న మెట్రో రైలు ప్రాజెక్టుల స్థితికి సంబంధించిన వివరాలు ఆరా తీశారు. గత ఐదేళ్ల కాలంలో మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, అప్‌గ్రేడేషన్ కోసం కేటాయించిన నిధులపై ప్రశ్నించారు. అలాగే మెట్రో రైలు ప్రాజెక్టుల ద్వారా వార్షిక ప్రయాణీకుల రద్దీ, పెండింగ్‌లో ఉన్న మెట్రో రైలు ప్రాజెక్టులు, వాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు సమాధానం ఇచ్చారు. 2025లో ఆంధ్రప్రదేశ్ నగరాల కోసం సమగ్ర మొబిలిటీ ప్లాన్ తయారీకి రూ. 84.48 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. మెట్రో ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేలా చూసేందుకు సంబంధిత ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన హైపవర్డ్ కమిటీ సమీక్షిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రత్యేక బోర్డులు చాలా మెట్రో రైలు ప్రాజెక్టులను జాయింట్ వెంచర్ స్పెషల్ పర్పస్ వెహికల్ అమలు చేస్తున్నాయని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుల తదుపరి పురోగతిని కేంద్ర ప్రభుత్వం ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్, ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ కింద సమీక్షిస్తుందన్నారు.

# వృత్తి నైపుణ్యం పెంపునకు క్షేత్రస్థాయి సందర్శన దోహదం




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వృత్తి విద్యలపై అవగాహనతో మంచి కెరీర్ సాధనకు ప్రభుత్వం కల్పించిన క్షేత్ర స్థాయి సందర్శన ఎంత గానో దోహదపడుతుందని సెవెన్ హిల్స్ పేపర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పసల పద్మ రాఘవరావు అన్నారు. పి ఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురం కు చెందిన "ప్రీ వొకేషనల్" విద్యార్థులు బుధవారం జి రాగంపేట గ్రామంలోని సెవెన్ హిల్స్ పేపర్ మిల్స్ ను సందర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్యా రంగాలపై అవగాహన కల్పించేందుకు ఈ 'ఎక్స్‌పోజర్ విజిట్' నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు వేస్ట్ నుండి రీసైక్లింగ్ ద్వారా పేపర్ తయారీ గురించి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా స్థానిక టెక్స్ టైల్స్ ఫ్యాక్టరీను సందర్శించి అక్కడ జి బూరయ్య ద్వారా దారాల ఉత్పత్తి గురించి తెలుసుకొన్నారు. పుస్తకాల్లో చదివిన విషయాలను ఇలా కళ్ళారా చూడటం వల్ల తమకు పనుల పట్ల మంచి అవగాహన కలిగిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉచిత వాహన సదుపాయాన్ని స్థానిక ప్రతిభ విద్యనికేతన్ అదినేత ప్రకాశ్ కల్పించడం పట్ల హెచ్ ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే జి భవాని, ఎన్ హరనాథ్, సంబంధిత ట్రేడ్ ఫ్యాకల్టీ జి యాదిద్య, జి జ్యోతి, వి దుర్గాప్ర సాద్, ఆర్ శివకుమార్, కే శివ ప్రసాద్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవలే గుర్తింపునిస్తాయి

**- పదోన్నతి పొందిన సిహెచ్ శ్రీనివాసరావుకు ఘన సన్మానం**

**- జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాలామాన్ సింగ్**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మనం చేసే సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో సహాయ సమాచార అధికారిగా పని చేస్తూ, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్‌గా పదోన్నతి పొంది విశాఖపట్నం బదిలీపై వెళ్తున్న సిహెచ్. శ్రీనివాసరావును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ కె.బాలమాన్ సింగ్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన నాటి నుండి నిబద్ధతతో శ్రీనివాసరావు తమ సేవలు అందించారని పేర్కొన్నారు. పదోన్నతి, బదిలీ అనేవి పరిపాలనలో భాగం మాత్రమేనని అన్నారు. నిబద్ధతతో పనిచేసిన అధికారులకు పదోన్నతులు లభించడం గర్వకారణమని, కొత్త బాధ్యతల్లో అదే ఉత్సాహంతో అధికారులు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని ఆయన సూచించారు. ఆయన సిబ్బందితో ఎంతో కలుపుగోలుగా ఉండేవారని, పాత్రికేయ మిత్రులకు శ్రీనివాస్ అజాత శత్రువని కొనియాడారు. కష్టపడి పని చేసే వాళ్ళు ఎక్కడైనా రాణించగలరని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ యం.గజపతిరావు, డివిజన్ పిఆర్ఓ జి.వి. రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ వి.మాధవి, జూనియర్ అసిస్టెంట్ ఎన్.సుజాత, టైపిస్ట్ రాధారాణి సాహు, రికార్డ్ అసిస్టెంట్ ఏ.నాగేశ్వరరావు, డ్రైవర్ పి.ప్రసాద్, కార్యాలయ సిబ్బంది మోహిని, నిర్మల, లక్ష్మణ్, గౌరీశ్వరి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# హింస, క్రూరత్వం, కుట్రలు ఏవైసీపీ

**- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



రాజకీయంగా ఉనికి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఒక వ్యూహంగా వైసీపీ మార్చుకుంది. అధికా రంలో ఉంటే పీకలు కోయడం, హింసాత్మక దాడులను ప్రోత్సహించిన జగన్.. అధికారం పోయాక కూడా అదే తరహాలో తన పార్టీ మూకలను రెచ్చగొడుతున్నారు. స్వయంగా అధినేతే హింసను, దాడులను ప్రోత్సహిస్తుండడంతో, వైసీపీ మూకలు గంజాయి మత్తులో మారణాయుధాలతో రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి. వైసీపీ నేతల హింసోన్మాదం సమాజ ప్రశాంతతను, రాష్ట్ర భవిష్యత్తుకు ఆటంకంగా తయారయింది. వైసీపీ అనుసరిస్తున్న తీరు గమనిస్తే, అది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, ఒక రకమైన సామాజిక ఉన్మాదాన్ని ప్రేరేపించేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికల నుండి ప్రత్యక్ష దాడుల వరకు.. రప్పా రప్పా డైలాగుల నుండి కత్తులు,తల్వార్లు చూపిస్తూ చేసే హెచ్చరికల వరకు.. జంతు బలులతో రక్తాభిషేకాల వరకు.. ఇవన్నీ ఒక ప్రకడ్బందీ కుట్రలా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీహార్లో ఉండే అరాచక సంస్కృతిని నేడు ఆంధ్ర రాష్ట్రానికి వైసీపీ నేతలు తీసుకు వస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు కక్ష సాధింపు చర్యలు సహజమని భావించే కాలంలో, ప్రస్తుత ప్రభుత్వం చట్టాన్ని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంముందుకు వెళ్లడాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారు. చట్టబద్ధమైన పాలన దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వ పాలననీ చేతగాని తనం అనుకోవడం వైసిపి అవివేకానికి తార్కాణం. గతంలో విపక్ష నేతలపై దాడులు జరిగినప్పుడు భావప్రకటన స్వేచ్ఛ అని సమర్ధించుకున్నవారు, ఇప్పుడు అదే స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ హద్దులు దాటుతున్నారు. చట్టాన్ని అమలు చేయడం అంటే హింస చేయడం కాదు, తప్పు చేసిన వారికి చట్టం ద్వారా శిక్ష పడేలా చూడటం. ఈ మౌనాన్ని చేతకానితనంగా భావిస్తే, చట్టం తన పని తాను చేసుకు పోయినప్పుడు వచ్చే ఫలితం తీవ్రంగా ఉంటుంది. అయితే చట్టమన్నా, న్యాయస్థానాలన్నా వైసీపీ నేతలకు గౌరవమనేది ఎప్పుడు లేదు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడి తనానికి అలవాటుపడ్డారు. సాక్షాత్తూ చంద్రబాబుపై దాడి చేసి డీజీపీతో భావవ్యక్తీకరణ అని చెప్పించారు. అంత ఘోరమైన పరిపాలన చేసిన తర్వాత.. అత్యంత ఘోరంగా ఓడిపోయినప్పటికీ... వారు ప్రశాంతంగా ఉన్నారు. తాము ఎన్నో చిత్రహింసలు పెట్టినా వారు ఏమీ చేయడం లేదని అలుసుగా తీసుకున్నారు. చట్టాన్ని పాటిస్తూ.. వచ్చిన ప్రభుత్వ తీరును చేతకానితనంగా తీసుకున్నారు. అడ్డగోలుగా తిట్లు ప్రారంభించారు. ఇలాంటి వారికి సరైన రీతిలో బుద్ధి చెప్పక పోతే కాలకేయుల్లా జనాల మీద పడిపోతారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు అనేవి సహజం. గెలిస్తే తన ఇష్టారాజ్యంగా పాలిస్తామంటే కుదరదు. ప్రజల్లో ఒక రకమైన భయాందోళన సృష్టించి, ఏవేవో అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం అనేది తగదు. అధికారంలో ఉన్నప్పుడు సమర్ధించి.. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని వ్యతిరేకి స్తాము అంటే కుదరదు. ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు కూడా. ఒక రాజకీయ నాయకుడిగా పాటించాల్సిన కనీస విలువలు, ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన కనీస విశ్వసనీయత లేకుండా వైసీపీ రాజకీయం నడిపింది. ఇప్పుడు కూడా అలానే నడపాలని చూస్తోంది. ప్రత్యర్థి పార్టీల నేతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. అయితే 15 ఏళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రస్థానంలో ఒక సిద్ధాంతాన్ని నమ్ముకున్నట్టు కనిపిస్తోంది ఆ పార్టీ. తాను చేస్తే నీతి, ప్రత్యర్ధి చేస్తే బూతు అన్నట్టు వైసిపి రాజకీయం చేస్తోంది.

**ఎక్కువగా తిరస్కరణ..**

15 ఏళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రస్థానంలో.. ఒక ఐదేళ్లు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. మిగిలిన కాలంలో ఏపీ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారు. అయితే దానిపై ఎంత మాత్రం ఆలోచన చేయడం లేదు. బూతు మాటలతో, కవ్వింపు చర్యలతో వైసిపి 2.0 కోసం కలలు కంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడేదో తాను సుపరి పాలన అందించానని.. తన హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో జరిగిన ఘటనలు గుర్తు చేసుకుంటే ఆ పార్టీకి నిద్ర పట్టదు. అయితే తాము చేసిన దాని గురించి పట్టించుకునే స్థితిలో ఉండదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అలా చేసుకుంటే ఆ పార్టీ పాతాళంలోకి వెళుతుంది. అంతలా అప్పట్లో తప్పులు జరిగాయి. కానీ అంతా సవ్యంగా జరిగింది అన్నట్టు ఇప్పటి ప్రభుత్వంపై అదే తరహా పోరాటం చేస్తున్నారు వైసీపీ నేతలు.

**వాలంటీర్ల కంటే ఘోరమైన బతుకులు**

రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్లను రాజకీయ అవసరాలకు వాడుకుని రోడ్డున పడేసిన జగన్, ఇప్పుడు తన సొంత పార్టీ నేతలను కూడా అదే బాటలో నడిపిస్తున్నారు. బూతులు మాట్లాడితేనే పదవులు, గుర్తింపు దక్కుతాయనే భ్రమలో ఉన్న నేతలు..ఆ భాష వల్లే ప్రజల్లో చీదరింపుకు గురవుతున్నారు. వ్యక్తిగత ప్రతిష్టను పణంగా పెట్టి పార్టీ కోసం తిట్లు తింటున్నా, కనీసం నైతిక మద్దతు ఇచ్చే నాథుడు లేకపోవడం వైసీపీ నేతల దుస్థితికి అద్దం పడుతోంది. వాలంటీర్లకైనా కనీసం గుర్తింపు ఉండేదేమో కానీ, ఈ కాలకేయ నేతలకు మాత్రం సొంత పార్టీలోనే గౌరవం లేని పరిస్థితి నెలకొంది. ఇన్ని అవమానాలు, ఇంతటి నిర్లక్ష్యం ఎదురవుతున్నా ఇంకా ఆ పార్టీలో కొనసాగడం అంటే ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. తప్పు చేసినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, కాపాడే వారు లేక, కనీసం ఓదార్చే వారు లేక బిక్కు బిక్కుమంటూ బతుకుతున్న ఈ నేతలు తమ భవిష్యత్తుపై పునరాలోచించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వాడుకుని వదిలేసే సంస్కృతి ఉన్న చోట విధేయత చూపడం అంటే, తమ రాజకీయ జీవితాన్ని తామే చేజేతులా సమాధి చేసుకోవడమే. సిగ్గులేని ఈ బానిస బతుకుల కంటే, స్వతంత్రంగా ఉండటమే మేలనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జగన్ రెడ్డి రాజకీయాన్ని నమ్ముకుని ఆయన వెంట నడిచిన వారు బాగుపడిన చరిత్ర లేదు. ఆ విషయం గుర్తు తెచ్చుకుంటే.. వైసీపీ నేతలకు తమకు ఓ క్లారిటీ వస్తుంది

**నాటి సంఘటనలు మరచిపోయారా?**

పల్నాడులో బోండా ఉమామహేశ్వరరావు కారుపై జరిగిన దాడి ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉంటుంది. ఇనప రాడ్లతో దాడి చేశారు అప్పట్లో. దానిని ప్రోత్సహించింది అప్పటి వైసిపి పాలకులు కాదా? అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దండయాత్ర చేశారు. కర్రలతో దాడికి దిగారు. అందులో తప్పేముంది అని ప్రశ్నించి జగన్ సమర్ధించుకున్నారు. అప్పటి వైసీపీ నేతలు గంట అరగంట భాగోతాలు, అనంతబాబు డోర్ డెలివరీ అరాచకాలు, గోరంట్ల మాధవ్ విశ్వరూపాలు ఆస్వాదించిన జగన్ ఇప్పుడు అరవ శ్రీధర్ విషయంలో విలువలు అంటూ ఉపన్యాసాలు చేస్తున్నారు. తాను చేస్తే నీతి.. ఎదుటివాడు చేస్తే బూతు అన్నట్టు హంగామా చేస్తున్నారు. నాడు చంద్రబాబు అరెస్టు సక్రమం అన్నారు. ఇప్పుడు మాత్రం అరెస్టులు చేస్తే అక్రమం అంటున్నారు. అయితే జనాలు అన్ని గమనిస్తున్నారన్న విషయాన్ని మరిచి పోతున్నారు. తమదైన మార్కు రాజకీయంతో ముందుకు వెళుతున్నారు. ప్రజల ఆలోచన గతి తప్పితే మాత్రం పాచిక పారుతుంది. లేకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత పతన స్థితికి చేరుకుంటుంది. ఏదైనా ప్రజల చేతుల్లోనే ఉంది.

# మంత్రి పదవి వంశీ కృష్ణ శ్రీనివాస్‌కి ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు

**- సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ మనసున్న మంచి ప్రజా నాయకుడు**

**- పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియో జకవర్గ శాసనసభ్యులు మరియు విశాఖ నగర జనసేన పార్టీ అధ్యక్షులు సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ మనసున్న మంచి ప్రజా నాయకుడని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన మనిషి అని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ అన్నారు. గురువారం ఉదయం శివాజీ పార్క్ దగ్గర ఉన్న ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ ప్రజల మనిషిగా ఆయనకు మంచి పేరు ఉందన్నారు. వేలాది మంది అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి ఆయనను పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం చూస్తే ప్రజలకు ఆయన పట్ల ఎంత అభిమానం ఉందో అర్థమవుతుందన్నారు. స్వచ్ఛమైన రాజకీయ నాయకుడని, ఆయన నాయకత్వం ఈ ప్రాంతానికి అవసరమన్నారు. కొంత మంది కుహన రాజకీయ నాయకులు సొంత డబ్బా, సొంత పబ్లిసిటీ చేసుకోవడం చూస్తున్నామన్నారు. అందుకు పూర్తిగా విరుద్ధం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అని తెలిపారు. అందుకు నిదర్శనం ఎమ్మెల్యే వంశీకృష్ణ పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులేనని పేర్కొన్నారు. అతనికి కులం మద్దతుతో పాటు మాస్ ఫాలోయింగ్ కూడా ఎక్కువగా ఉంది. ప్రజల్లో కూడా మంచి పేరు ఉంది. కాబట్టి మంత్రి పదవి వంశీ కృష్ణ శ్రీనివాస్‌కి ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు అని బి.వి.రామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పూర్ నికుంజ, ఫిలిం డైరెక్టర్ వి.వంశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం

**- ఫెడరేషన్ సభ్యత్వానికి భారీ స్పందన - విశాఖలో 400 మందికి పైగా రిజిస్ట్రేషన్ - 9 తో సభ్యత్వ గడువు ముగింపు**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు తమ యూనియన్‌ల ద్వారా తమ పరిధి మేరకు అండగా ఉంటామని జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి (ఎన్ఏజె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం ఇక్కడ విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవోహంలో మధురవాడతోపాటు పలు ప్రాంతాలకు చెందిన వర్కింగ్ జర్నలిస్టులకు సభ్యత్వం రెన్యువల్స్ ప్రక్రియను వీరు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయంలో అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించడం అభినందనీయమన్నారు. అలాగే అటాక్స్ వెల్ఫేరు ఇతర కమిటీల్లో కూడా జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అక్రిడేషన్ల సమస్య వీలైనంత త్వరగా కొలిక్కి వస్తుందని అయితే దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న ఇళ్ల స్థలాలు పెన్షన్లు వంటి అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. దశలు వారీగా ఒక్కొక్కటి అమలు చేయాలన్నారు.

**ఫెడరేషన్ సభ్యత్వానికి భారీ స్పందన**

ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ విశాఖ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ రెన్యువల్సు నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభిస్తుందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు



తెలిపారు. గత నెల 28 నుంచి నేటి వరకు సుమారు 400 మందికి పైగా తమ యూనియన్ సభ్యత్వం తీసుకున్నట్లు వీరు వెల్లడించారు. ఆదివారం భీమిలిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని సోమవారం తిరిగి ఏపీ ఎన్జీవో హోంలో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అదే రోజు సాయంత్రంతో 2026 సభ్యత్వ నమోదును ముగిస్తామన్నారు. ఇతర యూనియన్‌లలో ఉన్నవారు తమ యూనియన్‌లో సభ్యత్వం స్వీకరించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పి.నగేష్ బాబు బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు కార్యదర్శి కింతాడ మదన్, మధురవాడ ప్రాంత నాయకులు బి.ఆనందరావు, బాలు, నాయుడు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభినవ పూలే : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 'నిత్య కృషీవలుడు' బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేద ప్రజల పెన్నిధి నిరంతరం ప్రజల్లో ఉండే బీసీ టైగర్ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈరోజు జడ్జికోడ్ జంక్షన్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కేక్ కట్ చేసి వంశీకృష్ణ శ్రీనివాస్ బర్డే వేడుకలు ఘనంగా జరపడం జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ వర్గాల నుంచి వచ్చి అత్యంత కష్టపడి ఎమ్మెల్యేగా గెలిచి నిరంతరం దక్షిణ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వింటూ తక్షణమే వాటిని పరిష్కారం చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదినం ఘనంగా జరుపుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజు గౌడ్ యాత మాట్లాడుతూ వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన విశాఖ ప్రజలకు దక్షిణ నియోజకవర్గం ప్రజలకు ఒక పండగ వంటిదని కొనియాడారు అదేవిధంగా ఆయన సేవలు నిరంతరం దక్షిణ నియోజకవర్గం మరియు విశాఖ నగరం మొత్తం ఎవరికీ ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తానున్నానని నిలబడే ఏకైక వ్యక్తి వంశీకృష్ణ శ్రీనివాస్ అని రానున్న కాలంలో పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డీకే రెడ్డి యువ నాయకులు కార్యకర్తలు శరన్, సంపత్ సాగర్, సయ్యద్, పోలవరపు వాసు, దొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న 90వ వార్డు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 90 వార్డ్ రత్నా వారి వంటిల్లు నుండి ఏపీఎస్ఈబి కాలనీ, సీతారామ రాజు నగర్ మరియు సుసర్ల కాలనీ వంశీ సూపర్ మార్కెట్ వరకు 80 అడుగుల బిటి రోడ్ సెంటర్ డివైడర్ సుందరీకరణ కోసం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు సూచన మేర గతంలో 1.90 కోట్లతో జీవీఎంసీ నిధులతో శంకుస్థాపన చేయడం జరిగింది.

ఆ వర్క్‌లో భాగంగా ఈ రోజు బిటి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది. డిఈ వెంకటలక్ష్మితో ఆ పనులను పరిశీలిస్తూ కాంట్రాక్టర్‌కు తగు సూచనలు ఇస్తూ నాణ్యత ప్రమాణాలను పాటించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మున్నా, కృష్ణ మోహన్, అజయ్, కిరణ్, పోతల సతీష్, జ్యోతి, వెంకటలక్ష్మి, కొల్లి లక్ష్మి, పలక సత్యవేణి, యశోద పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను విశాఖ దక్షిణ నియో జకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి డాక్టర్ కందుల నాగరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అలాగే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి వార్డు అభివృద్ధి చెందే విధంగా తన వంతు సహకారాన్ని అందజేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన 32 వ వార్డు అభివృద్ధికి అని ఎంతో కృషి చేశారని కొనియాడారు. పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఎమ్మెల్యే ముందుకు వెళ్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పదవులు చేపట్టి, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

# బాధితురాలికి రూ.10,000లు ఆర్థిక సాయం చేసిన వాసుపల్లి

**- 38వ వార్డులో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పాక్షికంగా దగ్ధం - బాధితులను పరామర్శించిన దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** షార్ట్ సర్క్యూట్ కారణంగా పాక్షికంగా ఇల్లు దగ్ధమైన బాధితులకు విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. పేదలైన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. 38వ వార్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. స్పందించిన వాసుపల్లి గణేష్ కుమార్ కుమారుడు వాసుపల్లి సూర్య, దక్షణ వైసీపీ శ్రేణులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులు కర్రి బేబీ, కర్రీ గంగాధర్ కిరణ్ బాబులను పరామర్శించారు. వెంటనే తక్షణ సహాయంగా బాధితులకు 10 వేల రూపాయల నగదు అంద జేశారు. ఈ ఘటన జరగడం చాలా విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తారు. అన్ని విధాలుగా తను వారికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు వైసిపి అధ్యక్షులు గురజాపు రవి, జిల్లా జనరల్ సెక్రెటరీ గణగాళ్ల రామరాజు, చేపల నూకరాజు, అర్జున్ ప్రసాద్, పట్నాల సతీష్, శ్యామలరాలు, చేపల రాజు, అన్మోలు తదితరులు పాల్గొన్నారు.

# కరపలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం, స్థానిక నక్కా సూర్య నారాయణ మూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ (మహిళల కళాశాల)లో మంగళవారం డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో మాదక ద్రవ్య వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగం రాజరాజేశ్వరి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఈగల్ డిపార్ట్‌మెంట్, కాకినాడ జిల్లా ఎన్‌డీపీఎస్ టీమ్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ధర్మతేజ, షరీఫ్‌లు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించారు. కాకినాడ జిల్లా ఎన్‌డీపీఎస్ టీమ్ ఇన్‌చార్జ్ పీటర్, ఆయన బృంద సభ్యులు, కరప ఏఎస్ఐ సూరిబాబు పాల్గొని మాదకద్రవ్యాల వ్యసనం వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పూల్ సైడ్ నటాషా స్టాంకోవిక్ రెడ్ హాట్ ట్రీట్



మోడల్ కం నటి నటాషా స్టాంకోవిక్ టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా నుంచి విడిపోయిన సంగతి తెలిసిందే. అయితే బ్రేకప్ కారణంగా ఒత్తిడిని ఎప్పుడూ బయటకు తెలియనివ్వదు. నటాషా ఫ్రీమైండ్ తో చిల్ చేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ పూల్ సైడ్ స్వేచ్ఛగా ఎరుపు రంగు బికినీలో అందాలను ఆరబోస్తూ యువహృదయాలను కొల్లగొట్టింది. ఒక బిడ్డకు మమ్మీ అనే విషయాన్ని కూడా నటాషా మర్చిపోయేలా చేస్తోంది. ఇక నటాషా నేటి జెన్ జెడ్‌లో ఫిట్నెస్ ఫ్రీక్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పూల్ సైడ్ రెడ్ హాట్ బికినీలో నటాషా టోన్డ్ బాడీ సంథింగ్ స్పెషల్‌గా ఎలివేట్ అయింది. ఒంపు సొంపులను రంగరించి జెన్ జెడ్‌కి అవసరమైన ట్రీట్ ఇస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అయిపోతున్నాయి. హార్థిక్ నుంచి బ్రేకప్ అయ్యాక నటాషా ఏం చేస్తోంది? ఆర్జనకు సంబంధించిన మ్యాటర్స్ ఎలా ఉన్నాయి? అంటే.. నటాషా ప్రస్తుతం పూర్తిస్థాయి సినిమాల కంటే మోడలింగ్, బ్రాండ్ ప్రచారంపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. ఇటీవల ఒక ప్రముఖ కాస్మెటిక్స్ బ్రాండ్ ప్రచారకర్తగా క్యాంపెయిన్‌లో కనిపించింది. సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతూ బాగానే ఆర్జిస్తోంది. అయితే నటాషాకు ప్రస్తుతం సినిమాలేవీ లేవు. గతంలో –ఫ్లెష్– అనే వెబ్ సిరీస్‌లో నటించింది. ఇప్పుడు మళ్లీ నటనా కెరీర్‌పై ఫోకస్ పెడుతోందని సమచారం. మరోవైపు సామాజిక మాధ్యమాలలో మాత్రం నటాషా స్పీడ్‌గా ఉంది. డిజిటల్ క్రియేటర్‌గా చాలా యాక్టివ్‌గా ఉంటూ, హెల్త్, బ్యూటీ టిప్స్, రెడ్ లైట్ థెరపీ వంటి వాటి గురించి షేర్ చేస్తూ ఫాలోవర్లను అలరిస్తోంది. హార్దిక్ – నటాషా జంట జూలై 2024లో తమ విడాకులను అధికారికంగా ప్రకటించారు. ఈ వార్త అభిమానుల్లోకి షాక్ వేవ్స్‌ని పంపింది. ప్రస్తుతం వారి మధ్య ఉన్న బంధం కేవలం స్నేహబంధం. విడిపోయినా తమ కుమారుడు అగస్త్య కోసం వారిద్దరూ కలుస్తున్నారు.

# 'టాక్సిక్' రైట్స్ రాజు గారికే.. హిస్టారిక్ డీల్ సెట్ అయిందా?




స్టార్ హీరో యష్ లీడ్ రోల్‌లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్, మోన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్ పై వెంకట్ కే నారాయణ, యష్‌లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా సినిమా షూటింగ్ జరుగుతుండగా.. వచ్చే నెలల్లో వరల్డ్ వైడ్‌గా.. గ్రాండ్‌గా సినిమా విడుదల కానుంది. అయితే కేజీఎఫ్ సిరీస్ చిత్రాల తర్వాత యష్ చేస్తున్న సినిమా కావడంతో టాక్సిక్‌పై ముందు నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దానికి తోడు మేకర్స్ ఇటీవల రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై ఉన్న అంచనాలను భారీగా పెంచేశాయి. దీంతో మూవీకి పెద్ద ఎత్తున ప్రీ రిలీజ్ బిజినెస్ జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. పాన్ ఇండియా రేంజ్‌లో టాక్సిక్ రూపొందుతుండగా.. కొన్ని గంటలుగా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులకు సంబంధించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్..రూ.40 కోట్ల అడ్వాన్స్ రూపంలో సొంతం చేసుకుందని టాక్ వినిపించింది. కానీ ఇప్పుడు టాక్సిక్ మూవీ తెలుగు రైట్స్ ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు సొంతం చేసుకున్నారు. శ్రీ వెంకటేశ్వర డిస్ట్రిబ్యూషన్ ద్వారా పెద్ద ఎత్తున సినిమా రిలీజ్ చేయనున్నారు. అయితే తెలుగు రైట్స్ విషయంలో ఇండస్ట్రీలోనే హిస్టారిక్ డీల్ ఖరారు అయిందని ఇప్పుడు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. రూ.120 కోట్లకు దిల్ రాజు..టాక్సిక్ హక్కులను దక్కించుకున్నారని తెలుస్తోంది. దీంతో అది తెలిసినా నెటిజన్లు, సినీ ప్రియులు షాక్ అవుతున్నారు. అన్ని కోట్లా అంటూ కొందరు మూవీ లవర్స్ నోరెళ్ళబెడుతున్నారు. యష్ క్రేజ్ అలా ఉందని కామెంట్స్ పెడుతున్నారు. ఎలాంటి వాసుల్లో సాధిస్తుందో చూడాలని అంటున్నారు. నిజానికి.. కేజీఎఫ్ సిరీస్ చిత్రాలతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు యష్. తెలుగు రాష్ట్రాల్లో కూడా మంచి మార్కెట్ సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా కేజీఎఫ్ 2 తెలుగులో భారీ హిట్‌గా నిలిచింది. బ్రేక్ ఈవెన్ టార్గెట్ కంప్లీట్ చేసుకుని పెద్ద ఎత్తున లాభాలు సంపాదించింది. కాసుల వర్షం కురిపించింది. అందుకే ఇప్పుడు టాక్సిక్‌పై దిల్ రాజు భారీ పెట్టుబడి పెట్టినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే రూ. 120 కోట్ల డీల్ అంటే మామూలు విషయం కాదు. ముఖ్యంగా ఏపీ, తెలంగాణ మార్కెట్‌లో ఆ రేంజ్‌లో థియేటర్ల హక్కులు అమ్ముడవ్వడం చాలా అరుదు. అందుకే ఆ స్థాయి డీల్ బ్రేక్ ఈవెన్ కావాలంటే సినిమా భారీ కలెక్షన్లు సాధించాల్సి ఉంది. సినిమాకు కంప్లీట్ పాజిటివ్ టాక్ వస్తే బ్రేక్ ఈవెన్ టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉంది. మరి తెలుగులో టాక్సిక్ మూవీ ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# ఒక్క సినిమాతో నటీనటులుగా సత్తా చాటిన చైల్డ్ ఆర్టిస్టులు వీరే!



వెండితెరపై చిన్నప్పుడు ముద్దు ముద్దు మాటలతో, అల్లరి చేష్టలతో మనల్ని అలరించిన చిచ్చరపిడుగులు ఇప్పుడు వెండితెరకు రారాజులు, రాణులుగా మారిపోయారు. చైల్డ్ ఆర్టిస్టులుగా కెరీర్ మొదలుపెట్టి, తమ నటనతో మెప్పించిన వారు ఇప్పుడు హీరో హీరోయిన్లుగా టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు సత్తా చాటుతున్నారు. ఒకప్పుడు చిన్నారిగా చూసిన వీరు, ఇప్పుడు గ్లామర్ మరియు పర్ఫార్మెన్స్‌తో వెండితెరను ఏలడం చూస్తుంటే అభిమానులకు నిజంగా కన్నుల పండుగగా ఉంది. ఆ స్టార్స్ ఎవరో ఒకసారి చూద్దాం.. చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించి ఇప్పుడు హీరోలుగా సక్సెస్ అయిన వారిలో తేజ సజ్జా పేరు ముందుగా వినిపిస్తుంది. 'ఇంద్ర' సినిమాలో చిరంజీవి చిన్నప్పటి పాత్రలో మెప్పించిన తేజ, ఇప్పుడు 'హనుమాన్' సినిమాతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగారు. ఇక 'నువ్వే కావాలి' ఫేమ్ తరుణ్ ఒకప్పుడు జాతీయ అవార్డు గెలుచుకున్న బాల నటుడు. 'మృగరాజు' వంటి సినిమాల్లో నటించిన తనిష్, అలాగే సిసింద్రీగా మన ముందుకు వచ్చిన అక్కినేని వారసుడు అఖిల్ అక్కినేని తమదైన శైలిలో హీరోలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. చిన్నప్పుడే కెమెరా ముందు గడపడం వల్ల వీరికి నటనలో ఈజీగా పట్టు చిక్కింది. క్యూట్ చిన్నారుల నుంచి గ్లామరస్ క్వీన్స్ వరకు: హీరోయిన్ల విషయానికొస్తే, ఈ జాబితా చాలా పెద్దది. 'దేశముదురు'తో పాపులర్ అయిన హన్సిక బాలీవుడ్ సినిమాల్లో చిన్నపిల్లగా నటించిన సంగతి తెలిసిందే. 'విశ్వాసం'లో అజిత్ కూతురిగా నటించిన అనిఖా సురేంద్రన్, 'గంగోత్రి'లో క్యూట్ పాపగా అలరించిన కావ్య కళ్యాణ్ రామ్ ఇప్పుడు హీరోయిన్లుగా మారి ఆకట్టుకుంటున్నారు. 'ఉప్పెన' భామ కృతి శెట్టి, 'హనుమాన్ జంక్షన్' వంటి సినిమాల్లో కనిపించిన శ్రీ దివ్య చైల్డ్ ఆర్టిస్టులుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టి ఇప్పుడు స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. ఇక అలాగే 'విక్రమ్' సినిమాతో మెప్పించిన సారా అర్జున్, ధురంధర్‌లో హీరోయిన్‌గా ఒక్క సినిమాతోనే సెన్సేషన్ హీరోయిన్‌గా ఇమేజ్ తెచ్చుకున్నారు. బాల్యనటులుగా సినీ రంగానికి పరిచయమై, ఆ తర్వాత అదే రంగంలో నిలదొక్కుకోవడం అనేది అంత సులభమైన విషయం కాదు. రూపం మారినా, బాడీ లాంగ్వేజ్ మారినా తమ ప్రతిభతో ప్రేక్షకులను మెప్పించి స్టార్ హోదాను అందుకోవడం వీరి పట్టుదలకు నిదర్శనం. చైల్డ్ ఆర్టిస్టులుగా మన మనసుల్లో ముద్ర వేసిన వీరు, భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన చిత్రాలతో మనల్ని అలరించాలని కోరుకుందాం. అప్పటి క్యూట్ పర్ఫార్మెన్స్‌కు, ఇప్పటి పరిణతి చెందిన నటనకు ప్రేక్షకులు బ్రహ్మారథం పడుతున్నారు.

# చందమామ కెరీర్ ముగిసినట్లేనా?



కాజల్ అగర్వాల్ అలియాస్ చందమామ టాలీవుడ్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. రెండు దశాబ్దాల ప్రయాణంలో దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించింది. సీనియర్ హీరోల నుంచి తర్వాత తరం సూపర్ స్టార్ల వరకూ అందర్నీ కవర్ చేసిన నటి కాజల్.లక్ష్మీకల్యాణం నుంచి కన్నప్ప వరకూ చందమామ నటిగా ఒకే రకమైన ఛరిష్మాతో కొనసాగింది. టాలీవుడ్‌లో అత్యంత వేగంగా స్టార్ లీగ్‌లో చేరి నటిగాను కాజ్‌ల్‌ను చెప్పొచ్చు. ఒక్క సినిమా కాజల్ కెరీర్‌లో వెనక్కి తిరిగి చూడకుండా చేసింది. అదే మగధీర. లక్ష్మీకళ్యాణంతో హీరోయిన్‌గా లాంచ్ అయిన అమ్మడు అప్పటికే మరో రెండు సినిమాలు చేసింది. కానీ అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అదే సమయంలో దర్శకుడు రాజమౌళి దృష్టిలో పడింది. మగధీరలో మిత్రవింద పాత్రతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ సినిమాలో హీరోగా నటించిన రామ్‌చరణ్‌కు ఎంత పేరొచ్చిందో మిత్రవింద పాత్రతో అంతే క్రేజ్ కాజల్ కు దక్కింది. మిత్ర వింద పాత్రతో ఎంతో మంది నటీమణులకు స్ఫూర్తిగా నిలిచింది. నవతరం నటీమణుల్లో సైతం స్ఫూర్తిని నింపిన రోల్ అది. హీరోయిన్‌గా ఎలాంటి రోల్ పోషించాలని అడిగితే అంతా యువరాణి మిత్రవింద లాంటి పాత్ర ఒక్కటి చేసినా చాలా సంతోషంగా సినిమాల నుంచి రిటైర్మెంట్ తీసుకొవచ్చు అని చెప్పిన వారెంతో మంది. అంతగా ఆ పాత్ర ప్రభావం హీరోయిన్లపై ఉందన్నది కాదనలేని నిజం. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల వసూళ్లతో సరికొత్త రికార్డు సృష్టించింది. అప్పటి నుంచి కాజల్ కెరీర్‌లో వెనక్కి తిరిగి చూడలేదు. స్టార్ హీరోలే టార్గెట్‌గా సినిమాలు చేసింది. ఇతర భాషల్లో కూడా అవకాశాలు మొదలయ్యాయి. తమిళ తో పాటు హిందీ అవకాశాలు అందుకుంది. అయితే హిందీ కంటే కోలీవుడ్ లోనూ మంచి సక్సెస్ ను చూసింది. టాలీవుడ్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ అమ్మడి జర్నీకి తిరుగు లేదు కొంత కాలం. ఇలా తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో నటిగా తనదైన ముద్ర వేసింది. అటుపై వివాహం..పిల్లలు పుట్టడంతో పాటు కొత్త తరం హీరోయిన్ల నుంచి పోటీ పెరిగింది. దీంతో అవకాశాలు తగ్గాయి. సెకెండ్ లీడ్స్ విషయంలోనూ వెనకడుగు వేయలేదు. కాలంతో పాటు వచ్చిన మార్పుగా స్వీకరించి వాటిలోనూ కొనసాగింది. ఐటం పాటల్లోనూ సత్తా చాటింది. చివరిగా భగవంత్ కేసరిలో హీరోయిన్‌గా నటించింది. గత ఏడాది రిలీజ్ అయిన కన్నప్పలో గెస్ట్ రోల్ పోషించింది. ఐదేళ్ల క్రితం నుంచే కెరీర్ డల్‌గా సాగుతోంది. ఈ గ్యాప్‌లో చేసిన రెండు చిత్రాలే అవి. ప్రస్తుతం కాజల్ తెలుగులో సినిమాలుచేయలేదు.దీంతో కాజల్ టాలీవుడ్ ప్రయాణం ముగిసినట్లేనా అన్న చర్చ ఫిలిం సర్కిల్స్ లో తెరపైకి వస్తోంది. బాలీవుడ్‌లో మాత్రం రామాయణం సహా ది ఇండియన్ స్టోరీలో నటిస్తోంది.

# సహజ సిద్ధమైన సౌందర్యాలకు కేరాఫ్ అడ్రస్ మన్యం

## - మరో ఆంధ్రా ఊటీలా జిల్లాను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం - జలపాతాల ఖిల్లా మన్యం జిల్లా

## - మహా లొద్ద జలపాతం' ప్రారంభోత్సవంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి







**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** సహజసిద్ధమైన సౌందర్యాలకు కేరాఫ్ అడ్రస్ మన్యం ప్రాంతామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. జలపాతాల ఖిల్లా మన్యం జిల్లా అని కితాబిచ్చారు. జిల్లాలో అనేక సహజ సౌందర్యాలు ఉన్నాయని, మరో ఆంధ్రా ఊటీలా జిల్లాను తీర్చిదిద్దడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి మరియు పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా సాలూరు మండలం, కొదమ గిరిజన పంచాయతీ పరిధిలోని ప్రకృతి రమణీయమైన మహా లొద్ద జలపాతాన్ని మంత్రి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత, తొలిసారిగా లొద్ద జలపాతానికి శాశ్వత రహదారి సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. దుర్గమమైన గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. మహా లొద్ద జలపాతానికి చేరుకునేందుకు వీలుగా 6 కిలోమీటర్ల మేర రహదారిని సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ రోడ్డు మార్గం పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరిగి, స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రకృతికి ఆనవాలమైన ఈ జలపాతం నుంచి అందాలను వీక్షించేలా పెద్ద గెస్ట్ హౌస్‌ను నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. డోలీ మోతలు లేని జిల్లాగా చేయాలని అన్ని రోడ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. సిరివరకు రూ. 14 కోట్లతో మరొక రోడ్డును మంజూరు చేశామని, త్వరలో అది కూడా పూర్తయితే, విద్య, వైద్యానికి ఇబ్బంది ఉండదని చెప్పారు. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనలు చేస్తున్నారని, ముస్తాబు, రెవిన్యూ క్లినిక్, జలపాతాలను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ జలపాతం వద్ద పిల్లలు ఆనందంగా గడపాలని, ట్రెక్కింగ్ కూడా చేయవచ్చని అన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల కోసం గైడ్ లను, ట్రెక్కింగ్ కొరకు బోయ్స్ ఉన్నారని, వారితో చుట్టుప్రక్కల అందాలను తిలకించవచ్చని అన్నారు. తమ నియోజకవర్గంలో మూడు నీటి ప్రాజెక్టులు ఉన్నాయని, వాటిని కూడా పర్యాటక కేంద్రాలుగా మార్చి, బోట్ షికారు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హర్షం వ్యక్తం చేస్తూ, స్థానిక గిరిజనులు మంత్రికి బ్రహ్మరథం పట్టారు. మంత్రిపై పూలవర్షం కురిపించి, హారతులు ఇచ్చి, తమ సంప్రదాయ గిరిజన నృత్యాలతో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఆర్థిక పరిపుష్టి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అంతకుముందు గిరిజనులతో మమేకమై జలపాతం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, గిరిజనులు ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రారంభించి కాసేపు విక్రయాలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ.... జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి సూచించడం జరిగిందన్నారు. స్థానిక మంత్రి ఆధ్వర్యంలో ఈ రోజు ఏడవ జలపాతాన్ని ప్రారంబించుకున్నామని అన్నారు. జిల్లాలో అనేక జలపాతాలు ఉన్నాయని, ఇప్పటివరకు ఇవి ప్రజలకు అందుబాటులో లేవని, మరుగున పడ్డాయని, వాటిని జిల్లా, రాష్ట్ర, దేశ ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే గత మూడు నెలల్లో ఏడు జలపాతాలను ప్రారంభించుకున్నామని, ఇది నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. మహా లొద్ద, లొద్ద జలపాతాలు వద్ద నుంచి చూస్తే అద్భుతంగా కనిపిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందని అన్నారు. కమ్యూనిటీ డ్రివెన్ టూరిజం కింద వీటిని అభివృద్ధి చేసుకుంటున్నట్లు చెప్పారు. ఎంట్రీ పాయింట్ ఎరకు వచ్చేలా ప్రభుత్వం రహదారిని మంజూరు చేసిందని అన్నారు. సహజమైన ట్రెక్కింగ్ కొరకు వాహనాలు, బైకులను ఏర్పాటుచేయడం జరిగింది. స్థానికంగా మౌలికవసతులను కల్పించామని, తాగునీరు, ఆహారం, అద్భుతమైన అందాలకు ఇక్కడ కొదవలేదని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక్కసారైనా జలపాతాన్ని సందర్శించాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా అటవీ శాఖాధికారి జిపిపీ ప్రసూన, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డా. ఎస్.మన్మథరావు, అటవీ రేంజ్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా సంఘాలు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమన్నారాయణ ఎకోఫ్రెండ్లీ బాక్స్‌లకు పారిశ్రామిక సందర్శన సందర్భంగా సీతం

## బిబిఎ & ఎంబీఏ విద్యార్థులు ఆచరణాత్మక వ్యాపార అంతర్దృష్టులను పొందారు







**విజయనగరం, (రాజధాని వార్తలు):** తరగతి గది అభ్యాసం మరియు వాస్తవ ప్రపంచ వ్యాపార పద్ధతుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి నిరంతర ప్రయత్నాలలో భాగంగా, సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఈ ప్రాంతంలో పర్యావరణ అనుకూల పేపర్ ప్యాకేజింగ్ సొల్యూషన్స్ యొక్క ప్రముఖ తయారీదారు అయిన శ్రీమన్నారాయణ ఎకో ఫ్రెండ్లీ బాక్స్‌లకు (ECO PACK – ప్రీమియం పేపర్ ప్రొడక్ట్స్) దీదీూ మరియు వీదీూ విద్యార్థుల కోసం ఒక పారిశ్రామిక సందర్శనను నిర్వహించింది. ఈ సందర్శన సమయంలో, విద్యార్థులు ముడిసరుకు సేకరణ, ఉత్పత్తి ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, వ్యయ నిర్వహణ, సరఫరా గొలుసు కార్యకలాపాలు, బ్రాండింగ్ మరియు మార్కెటింగ్ వ్యూహాలతో సహా పూర్తి వ్యాపార జీవితచక్రానికి ప్రత్యక్షంగా పరిచయం పొందారు. కంపెనీ కార్యనిర్వాహకులు విద్యార్థులతో విస్తృతంగా సంభాషించారు మరియు పోటీ మార్కెట్‌లో స్థిరమైన తయారీ సంస్థను నడపడంపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. పర్యావరణ అనుకూల కాగితపు ఉత్పత్తులు ప్లాస్టిక్‌కు బలమైన ప్రత్యామ్నాయాలుగా ఎలా ఉద్భవిస్తున్నాయో కార్యనిర్వాహకులు వివరించారు, ఆవిష్కరణల ప్రాముఖ్యత, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఉండటం, కస్టమర్-కేంద్రీకృత రూపకల్పన మరియు కార్యాచరణ సామర్థ్యాన్ని హైలైట్ చేశారు. ధరల వ్యూహాలు, విక్రేత నిర్వహణ, మార్కెట్ డిమాండ్ విశ్లేషణ మరియు స్కేలింగ్ కార్యకలాపాలలో MSMEలు ఎదుర్కొంటున్న సవాళ్లపై కూడా విద్యార్థులకు వివరించారు. వ్యవస్థాపకత, నాయకత్వ నైపుణ్యాలు, ఆర్థిక క్రమశిక్షణ మరియు నిర్ణయం తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు మించి ఆచరణాత్మక వ్యాపార చిట్కాలను అందించారు. ఇంటరాక్టివ్ సెషన్ విద్యార్థులు ప్రశ్నలు అడగడానికి మరియు దీదీూ మరియు ఎంబిఏ ప్రోగ్రామ్‌లలో బోధించే సైద్ధాంతిక భావనలను నిజమైన పారిశ్రామిక సెట్టింగ్‌లలో ఎలా అన్వయించాలో అర్థం చేసుకోవడానికి వీలు కల్పించింది. విద్యార్థులతో పాటు వచ్చిన అధ్యాపక సభ్యులు మాట్లాడుతూ, ఇటువంటి పారిశ్రామిక సందర్శనలు నిర్వహణా సామర్థ్యం, పరిశ్రమ సంసిద్ధత మరియు నిర్వహణ విద్యార్థులలో కెరీర్ ధోరణిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. SITAM లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, శ్రీమన్నారాయణ ఎకో ఫ్రెండ్లీ బాక్స్‌ల యాజ మాన్యం నిఖిలేష్ గుప్తా యజమాని మరియు కార్యనిర్వాహకులకు వారి సహకారానికి మరియు విద్యార్థులకు అత్యంత సమాచారం మరియు సుసంపన్నమైన అభ్యాస అనుభవాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపింది. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం అధ్యాపక సభ్యులు బి.జ్యోతి, ఎ.వైష్ణవి మరియు ఎం.వంశీ మార్గదర్శకత్వంలో ఉత్సాహభరితమైన మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థుల బృందం ఈ సందర్శనలో చురుకుగా పాల్గొంది.

# 11 బార్‌లకు లైసెన్సులు మంజూరు - లాటరీ తీసి కేటాయించిన జిల్లా కలెక్టర్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో మిగిలిపోయిన 11 బార్‌లకు లైసెన్సులు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో లాటరీ నిర్వహించి, లైసెన్సులను కేటాయించారు. మొత్తం 11 బార్లకు 62 మంది ధరఖాస్తు చేసుకున్నారు. వీటి ద్వారా ధరఖాస్తు ఫీజు రూపంలో రూ.3.10 కోట్లు వసూలు అయ్యింది. లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు మొత్తం 6 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ దగ్గరా ఒక తాహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను నియమించారు. మొదటిగా లైసెన్సు విజేత పేరుతోబాటు, రిజర్వ్ 1, రిజర్వ్ 2 ధరఖాస్తుదార్ల పేర్లను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. రెండు రౌండ్లలో మొత్తం లాటరీ ప్రక్రియ ముగిసింది. ఈ లాటరీ ప్రక్రియలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి, ఎక్సైజ్ కమిషనర్ బి.శ్రీనాధుడు, ఏఈఎస్ ఎ.శ్రీరంగందొర, ఇతర ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 13వ వార్డులో ఇళ్ల స్వాధీన పత్రాలను అందజేసిన కెల్ల సునీత సత్యనారాయణ



**ఆరిలోవ, (రాజధాని వార్తలు):** ఈ రోజు అనగా గురువారం ఉదయం 10:30 గంటలకు పైనాపిల్ కాలనీ సచివాలయం-12 సంబందించిన అర్హులైన లబ్ధిదారులకు గతంలో సెంటు స్థలంలో ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణం పూర్తిచేసినందున ఇల్లు స్వాధీన పత్రాలను లబ్ధిదారులకు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, బీజేపీ మండలం అధ్యక్షులు కొండపల్లి సతీష్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, కిల్లంశెట్టి శ్రీనివాస్, తెలుగు యువత అధ్యక్షులు వడిశెల శ్రీనివాస్, ఎన్. ఆర్.వి.వి.ప్రసాద్ (కేబుల్ ప్రసాద్), యూనిట్ కో ఇంచార్జి మాసాబత్తుల శ్రీనివాస్, బూత్ కన్వీనర్స్ కల్లూరి వెంకటేష్, చింతలపూడి నాగేశ్వరరావు, గలాల రమణమూర్తి, రొక్కం నరేష్, ఆకాపు శ్యామ్ సుందర్ రావు, బీజేపీ కార్యకర్తలు బండారు శ్రీనివాసరావు, సప్ప త్రినాధ రావు, గుద్ది అచ్యుత రావు, తంగిల్ల ఆనంద్, సోమిరెడ్డి సురేషకుమార్, రెడ్డి సత్తిరాజు, గురజాపు వాసు, టీడీపీ మహిళా నాయకులు పేపకాయల పుష్పలత, ఎస్.కె.నూర్జహాన్, కర్రి మణి, మజ్జి శ్రీదేవి, ఎస్.కె.లాలు, సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తప్పులు సరిదిద్దాకే పాసుపుస్తకాలు పంపిణీ

## - జాయింట్ ఎల్.పి.ఎంలు కూడా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేసిన జాయింట్ కలెక్టర్ : జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**ఎల్.కోట, విజయనగరం, (రాజధాని వార్తలు):** తప్పులన్నీ సరిదిద్దిన తరువాతే పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామని, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ స్పష్టం చేశారు. ఆయన గురువారం ఎల్.కోట మండలంలో పర్యటించారు. లచ్చింపేటలో నిర్వహిస్తున్న రికార్డుల పరిశీలనా ప్రక్రియను జెసి పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మార్చినెలకు సంబంధించి గ్రామంలోని 851 ఖాతాలను పరిశీలించాల్సి ఉండగా, ఇప్పటివరకు 400 వరకు పరిశీలన పూర్తి చేసినట్లు సిబ్బంది వివరించారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లితే, వాటిని సరిదిద్ది రైతులకు చూపించిన తరువాతే ముద్రణ జరుగుతుందని తెలిపారు. కొత్త పాసుపుస్తకాల్లో తప్పులు ఉండే అవకాశం లేదని, అదేవిధంగా జాయింట్ ఎల్‌పిఎంలు కూడా తొలగించడం జరుగుతుందని జెసి స్పష్టం చేశారు. అంతకుముందు ఆయన ఎల్.కోట తాహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ సమస్యలపై సమీక్షించారు. మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూపరమైన అంశాలను ఆరా తీశారు. అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా వారి సమస్యలను పరిష్కరించాలని జెసి ఆదేశించారు. శ్రీరాంపురం గ్రామంలో భూసేకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో తాహసీల్దార్ పి.రమేష్, ఆర్ఎస్ డిటి జామి కోటప్పారావు, మండల సర్వేయర్ సృజన్, ఆర్ఐ కెవివికె సన్యాసిరావు పాల్గొన్నారు.

# పారదర్శకంగా బార్ లైసెన్సుల కేటాయింపు






**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత తెలిపారు. పార్వతీపురం, సాలూరు పట్టణాలకు చెందిన నాలుగు బార్ల కేటాయింపు ప్రక్రియ జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డీఆర్ఓ సమక్షంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ డ్రా ద్వారా లాటరీని తీసి బహిరంగంగా దరఖాస్తుదారులకు చూపించారు. ఈ ప్రక్రియలో మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకోగా, పార్వతీపురం పట్టణ పరిధిలోని మూడు బార్లను, సాలూరు పట్టణ పరిధిలో ఒక బారుకు డ్రా ద్వారా లైసెన్సులు కేటాయించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. సంతోష్, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల భవనాల నిర్మాణాలన్నీ జులై 15 కి పూర్తి కావాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో వేర్వేరు ఇంజనీరింగ్ ఏజెన్సీల ద్వారా నిర్మాణంలోనున్న భవనాలన్నీ జులై లోపల పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం కలెక్టర్ తన ఛాంబర్లో నిర్వహించి భవన నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ హెల్త్ క్లినిక్ భవనాలు, పి.ఎం ఆయుష్మాన్ హెల్త్ మిషన్ క్రింద మంజూరైన భవనాలు, 15వ ఆర్థిక నిధులతో మంజూరైన 24 హెల్త్ క్లినిక్ భవనాలు ఇప్పటికే పూర్తయిన వాటిని డి ఎం హెచ్ ఓకు అప్పగించాలని, స్లాబ్ లెవెల్లో ఉన్నవాటిని పూర్తి చేయాలని, ప్రారంభం కానీ వాటికి వెంటనే టెండర్లను పిలవాలని సూచించారు.

స్థలం లేని వాటి వివరాలు ఇస్తే స్థలం కేటాయించడం జరుగుతుందని అన్నారు. మొత్తం భవనాలన్నీ వచ్చే జులై లోపల పూర్తి కావాలని అన్నారు. ఈ సమావేశంలో డి ఎం హెచ్ ఓ డా.జీవన రాణి, డి సి హెచ్ ఎస్ డా. పద్మశ్రీ రాణి, ఏపీఎస్ఎంఐ డీసీ ఈఈ భారతి, పంచాయతీ రాజ్ ఎస్.ఈ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈలు, డీఈలు హాజరైనారు.

# బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో బుకింగ్ సౌకర్యం

## - పోస్టల్ ఇన్స్పెక్టర్ బొద్దల ఉపేంద్ర అధ్యక్షతన గజపతినగరం సబ్ డివిజన్ సిబ్బందికి సమీక్ష సమావేశం : డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గ్రామాలలో గల బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో కూడా ఇకనుంచి స్పీడ్ పోస్ట్, పార్సిల్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర అధ్యక్షతన గజపతి నగరం సబ్ డివిజన్ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు సబ్ పోస్ట్ ఆఫీసులలో మాత్రమే బుకింగ్ సౌకర్యం ఉండేదని, ఇక నుంచి బుకింగ్ సౌకర్యాన్ని బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో కూడా బుక్ చేసుకునే అవకాశం ఇండియా పోస్ట్ ప్రవేశపెట్టిందని,దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అదేవిధంగా పొదుపు పథకాలు కూడా చేయాలని తెలిపారు. ఈ నెల 18,19,20 తేదీలలో చేపట్టనున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్లు, డెవలప్మెంట్ ఆఫీసర్ పవన్, మూర్తి,సిబ్బంది పాల్గొన్నారు.


# తప్పులు సరిదిద్దాకే పాసుపుస్తకాలు పంపిణీ

## - జాయింట్ ఎల్.పి.ఎంలు కూడా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేసిన జాయింట్ కలెక్టర్ : జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**ఎల్.కోట, విజయనగరం, (రాజధాని వార్తలు):** తప్పులన్నీ సరిది ద్దిన తరువాతే పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామని, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ స్పష్టం చేశారు. ఆయన గురువారం ఎల్.కోట మండలంలో పర్యటించారు. లచ్చింపేటలో నిర్వహిస్తున్న రికార్డుల పరిశీలనా ప్రక్రియను జెసి పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మార్చినెలకు సంబంధించి గ్రామంలోని 851 ఖాతాలను పరిశీలించాల్సి ఉండగా, ఇప్పటివరకు 400 వరకు పరిశీలన పూర్తి చేసినట్లు సిబ్బంది వివరించారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లితే, వాటిని సరిదిద్ది రైతులకు చూపించిన తరువాతే ముద్రణ జరుగుతుందని తెలిపారు. కొత్త పాసుపుస్తకాల్లో తప్పులు ఉండే అవకాశం లేదని, అదేవిధంగా జాయింట్ ఎల్పిఎంలు కూడా తొలగించడం జరుగుతుందని జెసి స్పష్టం చేశారు. అంతకుముందు ఆయన ఎల్.కోట తాహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ సమస్యలపై సమీక్షించారు. మ్యుటేషన్లు, ఇతర రెవెన్యూపరమైన అంశాలను ఆరా తీశారు. అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా వారి సమస్యలను పరిష్కరించాలని జెసి ఆదేశించారు. శ్రీరాంపురం గ్రామంలో భూసేకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో తాహసీల్దార్ పి.రమేష్, ఆర్ఎస్ డిటి జామి కోటప్పారావు, మండల సర్వేయర్ సృజన్, ఆర్ఐ కెవివికె సన్యాసిరావు పాల్గొన్నారు.



# శ్రీ క్షేత్రంలో సుప్రభాత సేవ

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు, రమ్య, నీరజ మన్నే, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులన్నీ వచ్చే నెలలోగా పూర్తి కావాలి

## - మార్చి 31లోగా ఉపాధి హామీ బిల్లులన్నీ చెల్లింపు : పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ ఎం.కృష్ణతేజ





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఉపాధిహామీ కింద చేపడుతున్న రహదారులు, అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులన్నీ మార్చి 31వ తేదీలోగా చెల్లింపులు జరగనున్నట్లు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ పేర్కొన్నారు. మార్చి 15 వరకు పూర్తయిన అన్ని పనులకు సంబంధించిన బిల్లులను మార్చి 31 లోపు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కావున ఈలోగా అన్ని పనులను పూర్తిచేసి బిల్లులను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ మాసం వరకు అయిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లింపులు జరిగాయని, మిగిలిన పెండింగ్ బిల్లులు కూడా చెల్లింపులు జరగబోతున్నట్లు చెప్పారు.

కావున గుత్తేదారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టే పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్లో ఉండబోవని భరోసా కల్పించాలని సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పనులపై కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులన్నీ మార్చి 31 నాటికి పూర్తి కావాలని, లేదా ప్రారంభ దశలో ఉండాలని తెలిపారు. సగంలో నిలిచిపోయిన పనులకు అనుమతి ఉండబోదని తేల్చిచెప్పారు. మార్చి 15 తర్వాత సమర్పించే బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ మరియు ఇతర గ్రామీణ అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ. 30,000 కోట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులను పూర్తిచేయగలిగితే కొత్త పనులకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. కావున నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో అలసత్వం వహించకూడదని, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి సకాలంలో నివేదికలు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీఓలు మరియు ఇంజనీరింగ్ అధికారులతో పనుల లక్ష్యాలు మరియు సాధించిన పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపీడీఓలు తమ మండల పరిధిలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అన్నారు. మార్చి నెలాఖరులోగా ఎటువంటి పనులు పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల డ్వామా పీడీలు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు, పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్లు, డీఈఈలు, ఏఈఈలు, మండల అభివృద్ధి అధికారులు, ఇంజనీర్లు మరియు ఉపాధి హామీ పథక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కరప శ్రీ ఉప్పాలమ్మ తృతీయ వార్షికోత్సవం







**కరప, (రాజధాని వార్తలు):** కరప గ్రామ దేవత శ్రీ ఉప్పాలమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు శ్రీ దుర్గాదేవి ఆలయం నుండి 108 కలశాలతో, డోలు-సన్నాయి వాయిద్యాలతో, గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వ హించారు. ఆలయ అర్చకులు శ్రీ విలపర్తి సుబ్ర హ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనములు, పంచగవ్యారాధన, అష్టరాజార్చన, పంచవింశతి, కలశారాధన, అభిషేకం, మూలమంత్ర మూర్తి హోమములు, ఆవరణ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ, నీరాజన, మంత్రపుష్ప కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం కరప గ్రామ ప్రజలు అమ్మవారికి చీరలు, సారెలు, కుంకుమ, పసుపు, గాజులు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కరప మండలం వేములవాడ గ్రామ ప్రజలు ముసలమ్మ తల్లి ఆలయం నుంచి చీర, సారె, పసుపు, కుం కుమ, గాజులు, స్వీట్లు, పువ్వులు తీసుకు వచ్చి అమ్మ వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# చదువుకు వయసుతో సంబంధం లేదు

## - ప్రతి ఒక్కరూ కనీస అక్షరాస్యత సాధించాలి
## - డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలి
## - అక్షరాస్యత కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్ వెల్లడి



**మక్కువ, (రాజధాని వార్తలు):** చదువుకు వయసుతో సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ కనీస అక్షరాస్యత సాధించాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న వయోజన విద్యా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కలెక్టర్ మక్కువ మండలం పాపయ్యవలసలోని అక్షరాస్యత కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న తరగతులను, అభ్యాసకుల హాజరును మరియు బోధనా పద్ధతులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అభ్యాసకులతో మాట్లాడి, వారు నేర్చుకుంటున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు అభ్యాసకులతో బోర్డుపై అక్షరాలు, అంకెలు రాయించి వారి ప్రగతిని పరీక్షించారు. కేంద్రంలో విద్యుత్ దీపాలు, త్రాగునీరు మరియు కూర్చునేందుకు అవసరమైన వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ అనంతరం సంబంధిత అధికారులకు మరియు వాలంటీర్లకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. గ్రామంలోని నిరక్షరాస్యులందరినీ గుర్తించి, వారిని కేంద్రానికి వచ్చేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. కేవలం అక్షరాలే కాకుండా, సెల్ఫోన్ వాడకం, బ్యాంకు లావాదేవీల వంటి అంశాలపై కూడా ప్రాథమిక అవగాహన కల్పించాలని సూచించారు. అంకితభావంతో పనిచేస్తున్న వాలంటీర్లను అభినందిస్తూ, గైర్హాజరయ్యే అభ్యాసకులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు మరియు గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# లాభదాయక వ్యవసాయంపై పొలంబడి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతులకు లాభదాయక వ్యవసాయంపై పొలంబడిలో అవగాహన కల్పించారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమం రైతులకు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకురాలు రూప, మండల వ్యవసాయ అధికారి వి మురళీధర్‌లు పాల్గొని నాలుగు యాజమాన్య సూత్రాల గురించి రైతులకు వివరించారు. ఆరోగ్యకరమైన పైరును పెంచడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం, ప్రతి వారం చేనును పరిశీలించడం, రైతును తన పొలం పనులలో పండితునిగా (శాస్త్రజ్ఞులు)గా చేయడం మరియు పొలంబడిలో పాఠ్యాంశములు గురించి వివరించడంపై వివరించారు. ఇంకా సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు, పొలంలోని పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య సాంకేతిక కార్యాచరణ పరిశోధనలు, క్రిమి కీటకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కాగా 20 రోజుల భాగస్వా మ్య సాంకేతిక కార్యాచరణ కార్యక్రమం పరిశోధన, రైతుల భాగస్వామ్యంలో నిర్వహించారు. విత్తిన 45 రోజుల వరకు పెరు ఎదుగుదల, మొక్కలకు జరిగిన నష్టాని వేగంగా పూడ్చుకుని స్వయం యంత్రాంగం మొక్కల్లో అంతర్గతంగా ఉన్నదన్న సత్యాన్ని నిరూ పించడానికి ఒక చదరువు దుబ్బుల సంఖ్యను 40 గా స్థిరీకరించుకుని మొక్కల ఆకుల పొడవును 25:11, 501. మేరకు కత్తిరించారు. అలాగే మరో చధరపు మీటర్ల విస్తీర్ణంలో మొత్తం పిలకల సంఖ్యలో 10.1, 20 శాతం మేరకు పలకలను తొలగించారు. ఈ ప్రయోగం వలన ప్రతి రైతుకు ఫలితాలను పంట కోత దశలో చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఇ రూప, విఎఎ మణికంఠ, ప్రవీణ్, పొలంబడి రైతులు, పొలంబడి సదుపాయి కర్త పాలచర్ల వీర్రాజు, గుమెళ్ళ వీరబాబు, గున్నం శేషయ్య, దీన సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# బోధనాసుపత్రుల్లో హెర్బల్ గార్డెన్స్

**- రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా..!**


**- వాకింగ్ ట్రాక్‌తోపాటు ఇతర సౌకర్యాలు - స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం**

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల (హెర్బల్ గార్డెన్స్) ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ తోటల్లో పూల, ఔషధ మొక్కలను నాటతారు అలాగే వాకింగ్ ట్రాక్, బెంచీలు, మంచినీటి సదుపాయాన్ని కల్పించేందుకు అనువైన స్థలాలను అదికారులు పరిశీలిస్తున్నారు. తొలివిడతలో డైరెక్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, ప్రత్యేక స్పెషాలిటీ ఆసుపత్రు ల్లో పూల, ఔషధ మొక్కలతో కూడిన తోటలను ఏర్పాటచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. డీఎంఈ పరిధిలో ఉన్న అన్ని బోధనాసుపత్రులు, విశాఖలోని స్విమ్స్, ఈఎన్టి, తిరుపతిలోని మెటర్నటీ ఆసుపత్రి, పలాసలోని కిడ్నీ రీసెర్చి ఇన్స్టిట్యూటు, ఇతర ప్రత్యేక ఆసుపత్రుల్లో ఔషధ మొక్కల తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కూడా ఈ తోటల ఏర్పాటులో భాగస్వామ్యం కానుంది.

**తులసి, ఆమ్లా, ఇతర ఔషధ మొక్కలు**

అసుపత్రుల్లో అందుబాటులో ఉన్న స్థలాల లభ్యత అనుసరించి తులసి, ఆమ్లా, బిల్వపత్ర, మునగ, అశ్వగంధ, రోస్మేరి, రణపాల, కలబంధ (ఆలోవెరా), అశోక, పసుపు, బ్రహ్మి వంటి ఔషధ మొక్కలను నాటతారు కనిష్ఠంగా 15 నుంచి 40 రకాల మొక్కలను తోటల్లో పెంచేందుకు వీలుంది కనీసం అర ఎకరా వరకు స్థలం అందుబాటులో ఉంటే దానిని తోటగా తీర్చిదిద్దుతారు. వీటిల్లో రోగులు నడిచేందుకు వాకింగ్ ట్రాకింగులను ఏర్పాటు చేస్తారు.

ఇన్పషంట్లుగా ఉన్న వారితో ఉండే సహాయకులు కాసేపు ఈ తోటల్లో సేదదీరే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. వైద్య విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కూడా ఈ తోటల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్య నిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు ఈ తోటల ఏర్పాటుకు దాతల నుంచి ఆర్థిక సహకారం కూడా తీసుకోనున్నారు. ఇటీవల జరిగిన డిపార్ట్మెంట్ రివ్యూలో ముఖ్య మంత్రి చంద్రబాబు ఔషధ మొక్కల తోటల ఏర్పాటు పై ఆదేశాలు ఇచ్చారు.









# భారత కేంద్ర బడ్జెట్‌పై ఇంటరాక్టివ్ సెషన్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సీతం కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో "భారత కేంద్ర బడ్జెట్ 2026 – సమగ్ర అవలోకనం" అనే అంశంపై ఒక ఇంటరాక్టివ్ సెషన్‌ను ఫిబ్రవరి 4, 2026 మంగళవారం డీఎంఎస్ సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశిష్ కుమార్ అగర్వాల్, బి.కామ్, ఎఫ్‌సిఎ, డిసా, సీనియర్ పార్ట్నర్ – ఆశిష్ కుమార్ అగర్వాల్ & కో పాల్గొననున్నారు. ఈ సెషన్‌లో కేంద్ర బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు, ఆర్థిక విధానాలు మరియు వాటి ప్రభావాలపై సమగ్ర వివరణ అందించనున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థులకు కేంద్ర బడ్జెట్‌పై స్పష్టమైన అవగాహన కల్పించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా.డి.వి.రామమూర్తి ఇలాంటి అకాడమిక్ కార్యక్రమాలు విద్యార్థుల విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డా.ఎస్.వరూధిని ఈ సెషన్ ద్వారా విద్యార్థులు బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను ప్రాయోగిక దృష్టితో అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు, విద్యార్థిని మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan